కరీంనగర్
సూర్య
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల
ఆదివారం 3 మార్చి 2024 13పేజీలు

# కరీంనగర్ పార్లమెంట్ బీజేపి అభ్యర్థిగా బండి సంజయ్‌ను ప్రకటించిన బీజేపి అధిష్టానం



- నిజామాబాద్ నుండి ధర్మపురి అరవింద్,
- పెండింగ్ లో పెద్దపల్లి స్థానం



సూర్య కరీంనగర్ ప్రతినిధి

(వివరాలు 2లో)



# పెద్దపల్లి లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ పార్టీలో పెరుగుతున్న పోటీ

- వంశీకృష్ణకు టికెట్ ఇవ్వకపోతే కఠినమైన నిర్ణయం తీసుకోనున్న వివేక్!?
- మాదిగ సామాజిక వర్గం నుండి అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో పార్టీ హై కమాండ్!



సూర్య-గోదావరిఖని:

పెద్దపల్లి లోక్ సభ స్థానం నుంచి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీలో రోజురోజుకు పోటీ పెరుగుతోంది. 29 మంది పోటీ చేసేందుకు గాంధీభవన్ లో దరఖాస్తు చేసుకోగా ఐదుగురు పేర్లను స్క్రీనింగ్ కమిటీ పార్టీ హై కమాండ్ కు పంపిన విషయం తెలిసిందే. ప్రస్తుతం చెన్నూరు ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ జి.వివేకానంద పెద్దపల్లి ఎంపీగా పోటీ చేయాలనే బలమైన కోరికతో ఉండగా గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా గొంతు కోసినప్పటికీ ఆ తర్వాత బిజెపి పార్టీలో చేరి, మళ్లీ తిరిగి కాంగ్రెస్ లో చేరి అనూహ్యంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు ఎమ్మెల్యే గా గెలుపొందారు. వివేక్ సోదరుడు, మాజీ మంత్రి గడ్డం వినోద్ సైతం బెల్లంపల్లి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుండి (మిగతా 2లో)

# ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తాం

- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు
- గృహజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి
- లబ్ధిదారులకు జీరో బిల్ అందజేత

సూర్య మంథని

రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీ, అభయహస్తం గ్యారెంటీ పథకాలను తప్పనిసరిగా అమలు చేస్తామని, మరో రెండు గ్యారెంటీ పథకాల అమలును ప్రభుత్వం ప్రారంభించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంథని పట్టణంలో తన క్యాంపు (మిగతా 2లో)



# నిండు జీవితానికి రెండు చుక్కలు

- నేటి నుండి 5వ తేదీ వరకు పల్స్ పోలియో కార్యక్రమం
- ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరి

సూర్య పెద్దపల్లి ప్రతినిధి

దేశవ్యాప్తంగా నేడు పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభంకానుంది. చిన్నారుల్లో వైకల్యానికి కారణమయ్యే పోలియో వైరస్ నుంచి రక్షించేందుకు ప్రభుత్వాలు ఏటా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జనసంచారం ఎక్కువగా ఉండే చోట ఫ్లెక్సీలు, రేడియో, టీవీలలో ప్రకటనలు ఇస్తూ అవగాహన కల్పిస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 23, 331 కేంద్రాలు ఏర్పాటు చేసి నేటి నుండి వరుసగా మూడు రోజులు పోలియో చుక్కలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో డ్రాప్స్ వేయనున్నారు. మొత్తంగా దాదాపుగా 38 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్ వాడీ సెంటర్లు, గ్రామ పంచాయితీ కార్యాలయాలు, బస్టాండు, రైల్వే



స్టేషన్లు, ప్రధాన కూడళ్ళు, సర్కారీ స్కూళ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పెద్దపల్లి జిల్లాలో మొత్తం 381 పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేసి 62,700

(మిగతా 2లో)

# తెలంగాణలో 17కు 17 ఎంపీ సీట్లు గెలుచుకుంటాం

- దేశంలో 350 సీట్లలో బిజెపి పార్టీ గెలుపు ఖాయం
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్

సూర్య, జమ్మికుంట రూరల్

తెలంగాణలో 17 ఎంపీ స్థానాలకు గాను 17 ఎంపీ స్థానాలు బిజెపి పార్టీ గెలుచుకుంటుందని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. జమ్మికుంట మండలంలో కరీంనగర్ ఎంపీ బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ ప్రజాహిత యాత్ర కొనసాగుతుంది. ఆయనకు గ్రామాలలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.





జమ్మికుంట మండలంలోని శాయంపేట గ్రామంలో మీడియాతో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజాహిత యాత్రకు ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోందనీ, ఎక్కడికి వెళ్లినా మోదీకే ఓటేస్తామని ప్రజలు చెబుతున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీకి 350కి పైగా ఎంపీ (మిగతా 2లో)

# పెద్దపల్లిలోక్ సభ స్థానానికి కాంగ్రెస్ పార్టీలో పెరుగుతున్న పోటీ

**(మొదటి పేజి తరువాయి)**

గెలుపొందడంతో ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు ఒకే కుటుంబం నుండి ఉండగా వివేక్ తనయుడికి ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలంటూ పార్టీ హై కమాండ్ పై ఒత్తిడి తీసుకురావడాన్ని ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వక పోయిన పర్వాలేదు తన తనయుడు వంశీకృష్ణకు ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించాలంటూ వివేక్ తనదైన శైలిలో పావులు కదుపుతున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉంది, కానీ తనయుడికి అవకాశం ఇవ్వకపోతే రాజకీయంగా బలమైన, కఠినమైన నిర్ణయం తీసుకునే ఆలోచనలో వివేక్ ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సిట్టింగ్ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత ఇటీవల బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి చేరగా, తనకు ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇస్తామనే హామీ మేరకే ఆయన కాంగ్రెస్ లో చేరినట్లు సమాచారం. ఇదిలా ఉండగా దివంగత సీనియర్ పార్లమెంటేరియన్ జి.వెంకటస్వామి(కాకా) కు పెద్దపల్లి పార్లమెంట్ లో తిరుగులేదు అని అనుకున్న సమయంలో 1998లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుండి డాక్టర్ చెల్లమల్ల సుగుణ కుమారి పోటీచేసి కాకాను ఓడించారు. ఆ తర్వాత 2004 లో జరిగిన ఎన్నికల్లో తిరిగి కాకా ఎంపీగా గెలుపొందగా, 2009 ఎన్నికల్లో తన వారసుడిగా డాక్టర్ జి.వివేకానంద ను ప్రకటించిన కాకా ఆ ఎన్నికల్లో వివేక్ ను దగ్గరుండి గెలిపించుకున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని వీడి అప్పటి టిఆర్ఎస్ పార్టీలో చేరిన వివేక్ మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరి 2009 ఎన్నికల్లో బాల్క సుమన్ చేతిలో ఘోరంగా పరాజయాన్ని చవిచూశారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని వీడి మళ్లీ టిఆర్ఎస్ పార్టీలో చేరిన వివేక్ కు ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇస్తామని నమ్మించిన కేసీఆర్ చివరి క్షణంలో రాజకీయంగా గొంతు కోసి, కాంగ్రెస్ పార్టీలో ఉన్న వెంకటేష్ నేతను తీసుకొచ్చి పార్లమెంట్ పరిధిలో ఉన్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు గెలిపించుకున్న విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న వివేక్ తనయుడు వంశీకృష్ణను ఎన్నికల బరిలోకి దించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ మాత్రం పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో షెడ్యూల్డ్ క్యాస్ట్ లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు ఎక్కువగా ఉండటంతో, ఆ సామాజిక వర్గానికి చెందిన వారికే టికెట్ ఇవ్వాలని ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని సర్వే సంస్థలు సైతం మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికే టికెట్ ఇస్తే గెలుపు ఖాయం అనే సంకేతాలను కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ ఇచ్చినట్లు సమాచారం. ఈనెల 15వ తేదీ వరకు ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వారం రోజుల్లో తన అభ్యర్థిని ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థిని ప్రకటించిన తర్వాతనే బిజెపి తన అభ్యర్థిని ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఆశించి భంగపడ్డ వారు బిజెపిలోకి వెళ్లి పోటీ చేసే అవకాశాలు ఉండడంతో పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్ లో రాజకీయం రంజుగా మారింది.

# ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తాం

**(మొదటి పేజి తరువాయి)**

కార్యాలయం సమీపంలోని సత్యసాయి నగర్ లో గృహ జ్యోతి కార్యక్రమం క్రింద జీరో బిల్లులు లబ్ధిదారులకు అందజేశారు. సత్యసాయి నగర్ లో నివాసం ఉంటున్న డి.వేణుకు 481 రూపాయలు, మంథని లక్ష్మికి 179 రూపాయలు గృహ జ్యోతి సబ్సిడీ క్రింద కరెంట్ బిల్ ప్రభుత్వం చెల్లించి జీరో బిల్లులను వారికి అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు మరో రెండు గ్యారెంటీ పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, 200 యూనిట్ల వరకు గృహ వినియోగానికి ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాల అమలును ప్రారంభించామని అన్నారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం క్రింద ఇప్పటి వరకు 20 కోట్ల జీరో బస్ టికెట్స్ అందించామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచడం ద్వారా వేల మందికి లబ్ధి చేకూరిందని అన్నారు. గత ప్రభుత్వాలు అవలంబించిన ఆర్థిక విధానం వల్ల మన ఆర్థిక వ్యవస్థ బాగా దెబ్బతిందని, దానిని సరిచేస్తూ ఒక్కో పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రతిపక్షాలు అర్ధరహిత విమర్శలు మానుకోవాలని, గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులలో నాణ్యత, డిజైన్ లోపాలు ఉన్నాయని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తెలియజేసిందని, ముందు వారు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. మంథని ప్రాంతంలో ఉన్న వనరులు ఇక్కడి ప్రజల భూములు వినియోగించుకొని పెద్దపల్లి, భూపాల్ పల్లి జిల్లాకు ఒక్క ఎకరానికి సైతం సాగునీరు అందించకుండా ప్రాజెక్టు రూపకల్పన గత ప్రభుత్వం చేసిందని మంత్రి గుర్తు చేశారు. నిపుణులు, ఎన్.డి.ఎస్.ఏ అందించిన నివేదిక ప్రకారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మత్తులు చేసి పునరుద్ధరణ చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం మంథని లోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లా డుతూ, విద్యతో సమగ్ర అభివృద్ధి జరుగుతుందని భావించిన స్వర్గీయ నాయకులు శ్రీపాద రావు ఇక్కడి గ్రామాలలో పాఠశాలలను ఏర్పాటు చేశారని, స్పీకర్ గా మంచి విలువలు నెలకొల్పా రని, జవాబుదారీ తనంతో పని చేశారని తెలిపారు. స్వర్గీయ శ్రీపాద రావు గారి ఆశయాల సాధన మేరకు గతంలో మన ప్రభుత్వం హయాంలో జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంథనిలో సంగీత కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మంథని మారుమూల ప్రాంతంలో సైతం బస్ డిపో ఏర్పాటు చేయడంలో, రోడ్లు లేని గ్రామాలకు కాలినడకన వెళ్లి అందుబాటులో ఉన్న వనరులతో అభివృద్ధి చేయడంలో శ్రీపాదరావు కీలక పాత్ర పోషించారని, ఆయన ఆశయాలను సంపూర్ణంగా పూర్తి చేసే విధంగా కృషి చేయడం జరుగుతు ందని అన్నారు. ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద లబ్ధికి త్వరలో నాంది పలుకుతామని, పైరవీలకు తావులేకుండా అర్హులకు మాత్రమే లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు జారీ చేశామని, మెరిట్ విద్యార్థులకు మాత్రమే ఉద్యోగాలు లభిస్తాయని ఎటువంటి పైరవీలకు ఆస్కారం ఉండదని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో బాబా సాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఉచితంగా అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, టి.ఎస్. ఎన్.పి.డి.సి.ఎల్. ఎస్. ఈ. బి.సుదర్శన్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 17కు 17 ఎంపీ సీట్లు గెలుచుకుంటాం

**(మొదటి పేజి తరువాయి)**

సీట్లు వస్తాయని అన్నారు. ఈనెల 4, 5 తేదీల్లో ప్రధానమంత్రి సభలో పాల్గొనేందుకు వెళుతున్నానని తెలిపారు. ఈనెల 8, 9 తేదీల్లో శివరాత్రి సందర్భంగా ప్రజాహిత యాత్రకు విరామం ఉంటుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట మేరకు వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేసి తీరాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉందన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్నా రూ. 500లకు గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలులో కోత పెడుతున్నారనీ అన్నారు. 90 లక్షల రేషన్ కార్డులు కలిగివున్న కుటుంబాలుంటే 50 లక్షల కుటుంబాలకు కోత పెట్టడం అన్యాయం అని అన్నారు. ప్రతినెల ఉద్యోగులకు జీతాలివ్వకుంటే వాళ్లతో కలిసి సర్కార్ ను నిలదీస్తూనే ఉంటామన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ కుమ్మక్కై దొంగాట ఆడుతూ ప్రజలను మభ్యపెడుతున్నయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు జరిగాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కాగ్, విజిలెన్స్ సంస్థలు తేల్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనీ ప్రశ్నించారు. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు బిఆర్ఎస్ సైతం 6 గ్యారంటీల హామీల అమలు కోసం నిలదీయలేక పోతోందన్నారు. హైదరాబాద్ నుండి కరీంనగర్, రామగుండం రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం రక్షణ భూములివ్వడం హర్షణీయం అన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధిపై దృష్టి పెడితే కేంద్రం ఏ విధంగా సహకరిస్తుందో ఇదే నిదర్శనం అన్నారు. గత బిఆర్ఎస్ సర్కార్ కేంద్రాన్ని తిట్టడానికే పరిమితమైందే తప్ప ఏనాడూ అభివృద్ధి పై దృష్టి పెట్టలేదన్నారు. ఇకనైనా కేంద్రాన్ని, మోదీని తిట్టడం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కాంగ్రెస్ ఆరోపణలకే పరిమితమైతే తెలంగాణ ప్రజలు నష్టపోతారనీ పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. 10 ఏళ్లలో తెలంగాణలో దాదాపు రూ.10 లక్షల కోట్లకుపైగా నిధులిచ్చిందని అన్నారు. కేంద్రంలో మోదీని మళ్లీ ప్రధానిని చేస్తే శక్తివంతమైన భారత్ రూపుదిద్దుకుంటుం దన్నారు. భూదాన్ భూముల పేరుతో బోయినపల్లి వినోద్ కుమార్ కుటుంబ అక్రమాలు నిజం అని అన్నారు. గతంలో నేను ఈ అంశంపై ఆరోపణలు చేసిన మాట నిజం అని తెలిపారు. ఆంధ్రజ్యోతి కథనంపై విచారణ జరిపి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోరితే కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. విచారణ పేరుతో కాంగ్రెస్ జాప్యం చేస్తూ 6 గ్యారంటీల అమలు అంశాన్ని పక్కదోవ పట్టిస్తున్నారనీ ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు, బిజెపి నాయకులు ఎర్రబెల్లి సంపత్ రావు, బిజెపి జమ్మికుంట మండల అధ్యక్షుడు సంపెల్లి సంపత్ రావు, బిజెపి జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, మాడ గౌతమ్ రెడ్డి, గంద్ర నలిని, రామిడి సురేందర్ రెడ్డి, ఎండి షఫీ ఖాన్, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ పార్లమెంట్ బీజేపి అభ్యర్థిగా బండి సంజయ్ ను ప్రకటించిన బీజేపి అధిష్టానం

**- నిజామాబాద్ నుండి ధర్మపురి అరవింద్,**

**- పెండింగ్ లో పెద్దపల్లి స్థానం**

సూర్య కరీంనగర్ ప్రతినిధి

కరీంనగర్ పార్లమెంట్ బీజేపి అభ్యర్థిగా ప్రస్తుత ఎంపి బండి సంజయ్ కుమార్ ను బీజేపి అధిష్టానం ప్రకటించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో వున్న నిజామాబాద్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అరవింద్‌ను బీజేపి అధిష్టానం ప్రకటించింది. మరో నియోజక వర్గం అయిన పెద్దపల్లి స్థానానికి అభ్యర్థిని ప్రకటించలేదు. ఇక్కడ బలమైన అభ్యర్థిని బరిలోకి దింపాలని బీజేపి అధిష్టానం ఆలోచిస్తుంది. కరీంనగర్ అభ్యర్థిగా ప్రకటించినందుకు ఎంపి బండి సంజయ్ కుమార్ స్పందిస్తూ ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. నా జీవితం కరీంనగర్ ప్రజలకే అంకితమని, కరీంనగర్ ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడతానని, కరీంనగర్ నుండి భారీ మెజారిటీ గెలిపించి సత్తా చాటండనీ పిలుపునిచ్చారు. కేంద్రం నుండి అధిక నిధులు తీసుకొచ్చి కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి చేస్తానని, నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు

**(మొదటి పేజి తరువాయి)**

మందికి పోలియో చుక్కలు వేయడానికి ఏర్పాట్లు చేశారు అధికారులు. దేశ వ్యాప్తంగా ఈ ఆదివారంనాడు 0 నుండి 5 సంవత్సరముల పిల్లలందరికి పోలియో చుక్కలు వేయుటకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని గ్రామాలలో, పట్టణ వార్డులలో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఆదివారం ఆయా కేంద్రాలలో తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని అప్పుడే పుట్టిన పిల్లలకు కూడా పోలియో చుక్కలు వేయడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్చి 4 నుంచి 5 వరకు 2 రోజుల పాటు ఇంటింటికి తిరిగి అనివార్య కారణాల వలన పోలియో చుక్కలు వేయించుకోని వారిని గుర్తించి వారికి కూడా పోలియో చుక్కలు వేస్తామని 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పకుండా పల్స్ పోలియో చుక్కలను వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రమోద్ కుమార్ అన్నారు. జిల్లాలో 149 హైరిస్క్ ప్రాంతాలు (వలస కార్మికులు, ఇటుక బట్టీలు, నిర్మాణ కార్మికులు) గుర్తించి, వారి పిల్లలకు ప్రత్యేక బృందాలు (24) ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు.

# ప్రజల మనిషి శ్రీపాదరావు..

**- జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష**

**- ఐ డి ఓ సి లో ఘనంగా జన్మదిన వేడుకలు**





సూర్య జగిత్యాల ప్రతినిధి

ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల కోసం పాటుపడిన వ్యక్తి శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. స్వర్గీయ శ్రీపాద రావు 87 వ జన్మదిన వేడుకను IDOC సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జ్యోతీ ప్రజ్వలన చేసి, పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మారుమూల గ్రామంలో జన్మించి ఎన్నో ఒడిదుడుకులు తట్టుకుని ప్రజల కోసం ప్రజల మనిషిగా పనిచేసి రాష్ట్ర శాసన సభకు స్పీకర్ గా పనిచేసిన మహెూన్నత వ్యక్తి అని అన్నారు. సర్పంచ్ గా, మూడు సార్లు ఎమ్మెల్యే గా గెలుపొంది ఆ ప్రాంత ప్రజలకు సేవలందించారు తెలిపారు. పార్టీలకు అతీతంగా పనిచేశారని వివరించారు. ఆయన వారసులు దుద్దిల్ల శ్రీధర్ బాబు మంత్రిగా ఉండి ప్రజలకు సేవలందిస్తూ, జిల్లా ప్రగతి కోసం ఎల్లప్పుడూ సహాయకారిగా ఉంటు, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అదనపు కలెక్టర్ బి.ఎస్.లత మాట్లాడుతూ, శ్రీపాద రావు ప్రజలతో మమేకమైన వ్యక్తి అని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి శ్రేయస్సు కోసం పాటుపడేవారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర మాట్లాడుతూ, మారుమూల, అటవీ ప్రాంతంలో జన్మించారని, అక్కడి ప్రజల కోసం కష్టపడే వారనీ తెలిపారు. ఆయన జీవితం మార్గదర్శ నీయమని అన్నారు. మంథని నియోజక వర్గంలో శాసన సభ్యులు గా ఎన్నిక అయినారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాద రావు 87వ జయంతి వేడుకలు

**- నివాళులు అర్పించిన నాయకులు**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుదిళ్ల శ్రీపాద రావు జయంతి సందర్భంగా జిల్లా, నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో కరీంనగర్ డిసిసి కార్యాలయంతో పాటు నగరంలోని బస్టాండ్ సర్కిల్ వద్ద ఉన్నటువంటి శ్రీపాద రావు విగ్రహం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. మొదట డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పురుమల్ల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులతో కలిసి శ్రీపాద రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం నగరంలోని బస్టాండ్ వద్ద ఉన్న శ్రీపాదరావు విగ్రహానికి మొదటిసారిగా అధికారికంగా నిర్వహిస్తున్నటువంటి శ్రీపాద రావు జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ పమేల





సత్పతితో కలిసి మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి కార్యక్ర మాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. శ్రీపాద రావు జయంతిని పురస్కరించుకొని నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ నాయకులు వైద్యుల అంజన్ కుమార్ ,సమద్ ,నవాబ్, చర్ల పద్మ ,ఎండి తాజ్, శ్రావణ్ నాయక్ ,కొరివి అరుణ్ కుమార్, సిరాజ్ హుస్సేన్ ,గుండాటి శ్రీనివాస్ రెడ్డి ,సయ్యద్ అఖిల్, కుర్రపోచయ ,ములకల ప్రవీణ్ బొబ్బిలి విక్టర్ ,గడ్డం విలాస్ రెడ్డి, సలీముద్దీన్ ,నిహాల్, షబానా, మహమ్మద్ హనీఫ్, తాళ్లపల్లి సంపత్ గౌడ్ ,దండి రవీందర్ ,దన్నా సింగ్ ,కుంభాల రాజకుమార్, పడిశెట్టి భూమయ్య, ఎండి చాంద్ ,జ్యోతి రెడ్డి, పురంల రమేష్, వంగల విద్యాసాగర్ ,నెల్లి నరేష్, గంగుల దిలీప్, సిరిపురం నాగప్రసాద్, జీడి రమేష్, రోడ్ల సతీష్, మాలోతు మహాలక్ష్మి ,కంకణాల అనిల్, కుమార్ గుప్తా, మాదాసు శ్రీనివాసు, చింతల కిషన్ ,వాసిం ,ఎస్డి అజ్మత్ ,హస్త పురం రమేష్ ,ముక్క భాస్కర్, తాళ్ల పెల్లి అంజయ్య గౌడ్, గడప అజయ్, కరీం, రూపు రెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి, పోతారపు సురేందర్, మంద మహేష్ ,హస్త పురం తిరుమల ,కటకం కృష్ణ ,మామిడి సత్యనారాయణ రెడ్డి, వీర దేవేందర్, ఖయ్యూం ,మెతుకు కాంతయ్య, ఏగ్రా జయకుమార్, పరదాల లింగమూర్తి ,శ్రీరాములు రమేష్, కొట్టే ప్రభాకర్, సర్వర్ ,మెతుకు కాంతయ్య, కరీం, సర్వర్, సిరికొండ శివప్రసాద్, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిజం విద్యార్థుల క్షేత్ర పర్యటన

**సూర్య శంకరపట్నం**



పౌరాణిక, చారిత్రక ,ఆధ్యాత్మిక, పర్యాటక, ప్రాంతంగా ఇప్పుడిప్పుడే అభివృద్ధిలోకి వస్తున్న శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామంలో గల మత్స్య గిరింద్రవీరేంద్ర స్వామి దేవాలయాన్ని శనివారం హుజురాబాద్ మండలంలోని సింగపూర్ గ్రామంలో గల వి.ఎస్.ఆర్. డిగ్రీ కళాశాల లిజర్నలిజం విభాగం విద్యార్థులులి క్షేత్ర పర్యటనలో భాగంగా, (పర్యాటక ప్రాంతాల అధ్యయనంలో భాగంగా) సందర్శించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి .వి .ఎన్. హనుమకుమార్, జర్నలిజం అధ్యాపకులు లింగ బత్తిని మల్లేశం తెలిపారు. విష్ణుమూర్తి అవతారాలలో ఒకటైన మత్స్య గిరింద్ర స్వామీ దేవస్థానాన్ని ఆధ్యాత్మికం గాను, పర్యాటక ప్రాంతం గాను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని ఈ సందర్భంగా విద్యార్థులు గుర్తించారు. అన్ని రకాల సదుపా యాలు, సౌకర్యాలు కలిగినటువంటి పుణ్యక్షేత్రాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసినట్లయితే తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధివ్వ చెందుతుందని విద్యార్థులు తమ క్షేత్ర పర్యటనలో గుర్తించారు.

## అక్రమ లేఅవుట్లను తొలగించిన మున్సిపల్ కమిషనర్

**సూర్య జమ్మికుంట**



లేఅవుట్లు లేని ప్లాట్లు కోనుగోలు చేయకూడదని మునిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ తెలిపారు. శనివారం ధర్మారం, రామన్నపల్లి, జమ్మికుంట అయ్యప్ప టెంపుల్ ఎదురుగా సర్వే నెంబర్ 785 లలో లేఅవుట్ అనుమతులు లేకుండా భూమిని చదును చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో మున్సిపల్ అధికారులు వాటిని తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆయాజ్ మాట్లాడుతూ ప్లాట్లు విక్రయించేవారు మున్సిపల్ అధికారుల నుండి లే అవుట్ అనుమతులు తీసుకున్న తర్వాత వాటిని విక్రయించాలని లేనట్లయితే వారికి భవిష్యత్తులో త్రాగునీరు ఇంటి నిర్మాణ అనుమతులు , బ్యాంకు లోన్ లు రోడ్లు డ్రైనేజీ కాలువల విషయంలో సమస్యలు తలెత్తుతాయన్నారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడ కూడా లేఅవుట్లు లేకుండా వెంచర్లు చేసి ప్లాట్లు విక్రయించినట్టయితే చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. లేఅవుట్ లేని ప్లాట్లను కొన్నచో, వాటికీ మున్సిపల్ అనుమతి రాదని, బ్యాంకు లోన్ ఇవ్వరని అయన అన్నారు. పట్టణంలో ఫ్లాట్లు గాని వెంచర్లు కానీ ఉన్నట్లయితే వాటిని మున్సిపల్ ఆధ్వర్యంలో కూల్చి వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీఓ శ్రీధర్, టీపీస్ ప్రదీప్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

## వినియోగ దారుల హక్కుల సంస్థ మహిళ అధ్యక్షురాలుగా వరాల జ్యోతి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ రాజు, జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు వరాల జ్యోతి నియామకం జరిగిన సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి గౌరీ శంకర్ ని మర్యాద పూర్వకంగా కలవటం జరిగింది. జిల్లాలో పౌరసరఫరాలకు సంబంధించిన మోసాలు, చౌక ధరల దుకణాలలో జరుగుతున్న బియ్యం అక్రమ విక్రయాలను తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేయటం జరిగింది. అలాగే సంస్థ సభ్యులు కమిటీ భవిష్యత్ లో నిర్వహించబోయే కార్యక్రమాలకు హాజరు కావాల్సిందిగా గౌరీ శంకర్ ని కోరటం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా మహిళ విభాగం ఉపాధ్యక్షులు రమాదేవి, జ్ఞానేశ్వరి, జనరల్ సెక్రెటరీ నిరుపరాని, సెక్రెటరీ మంజుల, సభ్యులు మధుమిత పాల్గొనటం జరిగింది.

## నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్ నగరపాలక సంస్థ ఆద్వర్యంలో దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నగరపాలక సంస్థ కార్యాలయంలో నగర ప్రథమ పౌరులు మేయర్ యాదగిరి సునీల్ రావు, కమీషనర్ బోనగిరి శ్రీనివాస్, పలువురు కార్పోరేటర్లు శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా జరిపించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి మేయర్ యాదగిరి సునీల్ రావు, కమీషనర్ బోనగిరి శ్రీనివాస్ నివాళులు అర్పించారు. గొప్ప రాజకీయ నాయకునిగా ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. మరో వైపు నగరంలోని బస్టాండ్ చౌరస్తాలో గల శ్రీపాదరావు విగ్రహానికి కూడ మేయర్, కమీషనర్, పలువురు కార్పోరేటర్లు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... సర్గీయ మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతిని అధికారికంగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం చాలా హర్షనీయం అన్నారు. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ కార్యాలయంలో శ్రీపాదరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి... ఆయన చేసిన సేవలను స్మరించుకున్నామని తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆద్వర్యంలో శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి వారి సేవలు స్మరించుకున్నట్లు తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో కార్పోరేటర్లు గంట కళ్యాణీ శ్రీనివాస్, ఐలేంధర్ యాదవ్, గందె మధావి మహేష్, తోట రాములు, సల్ల శారద రవీంధర్, దిండిగాల మహేష్, బుచ్చిరెడ్డి, నేతికుంట యాదయ్య, సరిల్ల ప్రసాద్, నక్క పద్మ కృష్ణ, నాంపెల్లి శ్రీనివాస్, కుర్ర తిరుపతి, అదనపు కమీషనర్ స్వరూప రాణీ, ఆర్వో అంజనేయులు, నగరపాలక సంస్థ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీపాద రావు జయంతి

**సూర్య జమ్మికుంట**



మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకలను శనివారం మున్సిపల్ ఛైర్మెన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, కమీషనర్ మొహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీపాద రావు , సర్పంచ్, శాసన సభ్యునిగా, స్పీకర్ గా ఉన్న సమయంలో అయన చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి కాన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**సూర్య తిమ్మాపూర్ / కరీంనగర్ ప్రతినిధి**



తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన మాతంగి కనకమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు రామ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పోలు రామ్ మాట్లాడుతూ మాతంగి కనకమ్మ మరణించడం చాలా బాధాకరం అని తన వంతు సాయంగా రూ. 5 వేల ఆర్థిక సాయం ను పోలు రామ్, పోలు రమేష్ బాధిత కుటుంబానికి అందజేశారు.

## జెబిఎస్ -శామీర్పేట్ ఎలివేటెడ్ కారిడార్ మంజూరు బిఆరెస్ పోరాట ఫలితమే

**- మాజీ మార్కెట్ చైర్మన్ చుక్కరెడ్డి**

**సూర్య చొప్పదండి**



హైదరాబాద్ జెబిఎస్ నుండి శామీర్పేట్ వరకు ఎలివేటెడ్ కారిదార్ బిఆరెస్ ప్రభుత్వ కృషి వల్లే మంజూరు అయిందని మాజీ మార్కెట్ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి అన్నారు. బిఆరెస్ ప్రభుత్వం హయాంలో ఈ కారిడార్ కోసం ప్రతిపాదన కేంద్రానికి పంపించి అప్పటి సిఎం కెసిఆర్, కేటీఆర్, వినోద్ కుమార్ లు కేంద్రంపై ఎంతో ఒత్తిడి తెచ్చారని తెలిపారు. అంతే గాక ఈ ఫ్లైఓవర్ కోసం రక్షణ శాఖ భూములు ఉన్న దృష్ట్యా ప్రత్యామ్నాయంగా 500 ఎకరాలు భూమి మరో చోట ఇచ్చి కేంద్రంతో మంజూరు కు ఒప్పించారని తెలిపారు. ఇదంతా పక్క దారి పట్టిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం 80రోజుల్లోనే ఫ్లైఓవర్ మంజూరు చేయించినట్లు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ నాయకులు రికార్డులతో వస్తే ఎవరు మంజూరు చేయించారో నిరూపిస్తామని అన్నారు.

## అంగన్వాడి ఖాళీ ఉన్న పోస్టులను త్వరలో భర్తీ

**సూర్య శంకరపట్నం**

శంకరపట్నం మండలంలో అంగన్వాడి ఐదు, టీచర్లు ఏడు, హెల్పర్లు ఖాళీగా ఉన్నాయని శిశు సంక్షేమ శాఖ కరీంనగర్ జిల్లా ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు, తాడికల్ టీచర్, హెల్పర్, కేశవపట్నం టీచర్, కరీంపేట్ టీచర్, మెట్టుపల్లి టీచర్, హెల్పర్, లింగాపూర్ టీచర్, కొత్తగట్టు హెల్పర్, అందాల పల్లి హెల్పర్, మొలంగూర్ హెల్పర్, వంకాయ గూడెం హెల్పర్స్,ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు చెప్పారు,ఈ ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు వారు వివరించారు.

# సీనియర్ సిటీజేన్స్ సమాజ మార్గదర్శకులు. విస్మరించేవారు శిక్షార్హులే

**జగిత్యాల ఆర్డీవో పి. మధుసూదన్.**

**సూర్య జగిత్యాల టౌన్**

సీనియర్ సిటీజేన్స్ సమాజ మార్గదర్శకులని వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ భద్రత కల్పించాల్సిన బాధ్యత పిల్లలదేనని,వారిని విస్మరించేవారు శిక్షార్హులేనని జగిత్యాల ఆర్డీవో పి.మధుసూదన్ అన్నారు.శనివారం ఆర్డీవో కార్యాలయంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో జగిత్యాల ఆర్డీవో గా పి.మధుసూదన్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మధుసూదన్ కు పుష్పగుచ్ఛం లు అందించి,సన్మానించి స్వాగతిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ,సీనియర్ సిటీజేన్స్ 2024



డైరీ,ఆవిర్భావ ప్రత్యేక సావనీర్ అందజేశారు.అనంతరం ఆర్డీవో సీనియర్ సిటీజేన్స్ చట్టం పుస్తకాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ వయో వృద్ధుల కు రాష్ట్ర,జిల్లాల వ్యాప్తంగా సేవలు అందిస్తున్న రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ ను సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా,డివిజన్ ,మండల ప్రతినిధులను, అభినందించారు. వయోవృద్ధుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ 14567 ఉందని ,వారిని నిరాదరిస్తున్న,వేధిస్తున్న వారిపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు.వేధింపులకు గురి చేసిన వారికి వయో వృద్ధుల సంరక్షణ చట్టం 2007 ప్రకారం 3 నెలల వరకు జైలు శిక్ష ,జరిమానా విధించే వీలుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,ఉపాధ్యక్షులు పి.సి.హన్మంత్ రెడ్డి, ,ఎం.డి.యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.ఆశోక్ రావు, జగిత్యాల డివిజన్ అధ్యక్షుడు బి.రాజేశ్వర్, పట్టణ అధ్యక్షుడు సతీష్ రాజ్,వివిద మండలాల ,గ్రామాల సీనియర్ సిటీజేన్స్ ,పెన్షనర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన



**సూర్య గొల్లపల్లి**

నెహ్రూ యువ కేంద్రం, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ గుంజపడుగు ఆధ్వర్యంలో కొండగట్టులోని జేఎన్టీయూ కళాశాల లో విద్యార్థులకు, యువతకి ఓటు హక్కు వినియోగం పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా యూత్ ఆఫీసర్ రాంబాబు పాల్గొని ఓటు ప్రత్యేకత, ఓటు ప్రాధాన్యత, మన ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి అనే ఇతర అంశాలపై యువతకి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామర్ ఇంచార్జ్ ప్రవీణ్, యూత్ క్లబ్ అధ్యక్షుడు మారం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతత క్రీడలతోనే సాధ్యం

**- జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ జ్యోతి**

**సూర్య జగిత్యాల**



మానసిక ప్రశాంతత క్రీడలతో సాధ్యమని జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. శనివారం జగిత్యాల పట్టణంలోని ఎస్ ఎస్ ఎస్ ఎం డిజి స్కూల్ వార్షిక స్పోర్ట్స్ మీట్ వేడుకలకు చైర్పర్సన్ జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకు సైతం సమయం కేటాయించాలని లేనట్లయితే విద్యార్థులకు మానసిక ఒత్తిడి పెరుగుతుం దన్నారు. ఆ ఒత్తిడిని దూరం చేసి మానసిక ప్రశాంతతను చేకూర్చడం క్రీడలతోనే సాధ్యమన్నారు. బాల్యం గుర్తుకు వచ్చేలా పేరెంట్స్ కు సైతం క్రీడా పోటీలు నిర్వహించడం, బహుమతులు అందజేయడం అభినందనీయ మన్నారు. పోటీ ప్రపంచంలో సైతం విద్య తో పాటు భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడంలో ఈ పాఠశాల యాజమాన్యం కృషి అనిర్వచనీయమని జ్యోతి పేర్కొన్నారువిద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## మున్సిపల్ కార్మికుల హాజరు పరిశీలించిన చైర్పర్సన్ జ్యోతి

**సూర్య జగిత్యాల టౌన్**



జగిత్యాల పట్టణంలో శనివారం తెల్లవారుజామున పారిశుధ్య కార్మికుల హాజరును మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి– లక్ష్మణ్ పరిశీలించారు. ఈ సందర్భముగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు అన్ని విధాల అండగా ఉంటామని, పట్టణములో పారిశుధ్య పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా విధులు నిర్వహించాలని కార్మికులకు సూచించారు. వీరి వెంట మున్సిపల్ కమిషనర్ అనిల్ బాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, రాము, జవాన్లు, కార్మికులు ఉన్నారు.

## మూడు ఉద్యోగాలు సాధించిన యువతికి సన్మానం

**సూర్య బీర్పూర్**



బీర్పూర్ మండల కేంద్రంలో గోసంగి కులానికి చెందిన దాసరి స్వప్న అలియాస్ రయికంటి స్వప్న మూడు ఉద్యోగాలు సాధించగా శనివారం గోసంగి కుల సభ్యులు అభినందించారు. మండల కేంద్రంలోని స్వప్న ఇంటికి వెళ్లి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోసంగి కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుంకరపెల్లి రవీందర్, మాజీ ఉప సర్పంచ్ హరీష్, గోసంగి కుల సంఘ అధ్యక్షులు సలికే సురేష్, డాక్టర్ శేఖర్, ఆర్మీ ఉద్యోగి బరుకుంట్ల రాజు ఉన్నారు

## అక్రమ ఇసుక రవాణా కు అడ్డుకట్ట

**సూర్య మేడిపల్లి**



మండలంలోని పోరుమల్ల గ్రామ శివారులో శనివారం రోజు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పైడిమడుగు గ్రామానికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్ లను మేడిపల్లి పోలీసులు పట్టుకొని ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు మేడిపల్లి ఎస్ ఐ శ్యామ్ రాజ్ తెలిపారు.ఎవరైనా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్ట పరంగా కటిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డాక్టరేట్ సాధించిన గౌర్రెకాపల యువకుడు

**సూర్య కొడిమ్యాల**





జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామంలోని ఓ పేద గొర్రెల కాపరి కుటుంబానికి చెందిన చిగుర్ల రవి అనే యువకునికి ఉస్మానియా విశ్వవిద్యాలయం భూగోళ శాస్త్ర విభాగం ద్వారా యుజిసి రీసెర్చ్ సెంటర్ ఫర్ ఇండియన్ ఓషియన్ స్టడీస్ మాజీ డైరెక్టర్ అండ్ ప్రొఫెసర్ గీతారెడ్డి అనంత్ పర్యవేక్షణలో "స్పేసియల్ అనాలిసిస్ ఆఫ్ ప్రైమరీ అగ్రికల్చర్ కో ఆపేటివ్ సొసైటీస్ ఇంపాక్ట్ ఆఫ్ అగ్రో సర్వీస్స్ అండ్ సోషియో ఎకనామిక్ ఎంపవర్మెంట్ అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పణ చేసి దాని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు పలు విషయాలపై వాటి సమస్యల పరిష్కారంకు తగు సూచనలు చేసినందుకు గాను ఫిహెచ్డి డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇతను గతంలో కూడా వివిధ అంశాలపై పరిశోధనలు చేసి వాటికి సంబందించిన పదికి పైగా పరిశోధనా పత్రాలు యుజిసి గుర్తింపు పొందిన వివిధ ప్రముఖ పీర్ రివ్యూ జర్నల్స్ లో ప్రచురితం చేశాడు. అంతేకాకుండా పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని వివిధ అంశాలపై తను చేసిన పరిశోధనలపై ఉపన్యాసాలు ఇచ్చి పలువురి సామాజిక శాస్త్రవేత్తల సీనియర్ ప్రొఫెసర్ల ప్రశంసలు అందుకున్నాడు. అదేవిధంగా జాతీయస్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్ ఫర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ జూనియర్ రీసెర్చర్ పరీక్షను కూడా మూడు సార్లు ఉతీర్ణత సాధించి ఉన్నాడు.

## బాధిత దుకాణ యజమానికి పరామర్శ

**సూర్య జగిత్యాల**



జగిత్యాల పట్టణంలో బైపాస్ రోడ్ లో జాబితాపూర్ గ్రామానికి చెందిన బండారి రామన్న ప్లంబింగ్, ఎలక్ట్రికల్ షాప్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదవశాత్తు షాప్ కాలిపోగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గ ఇన్చార్జ్ డా.బోగ శ్రావణిప్రవీణ్ శనివారం కలిసి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. వారి వెంట జగిత్యాల పట్టణ అధ్యక్షులు రంగు గోపాల్ ,పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు,బోగ నరేష్ తదితరులు వున్నారు.

## గణేష్ పల్లిలో కుల సంఘ సభ్యుల ఘర్షణ

**- రెండు వర్గాల మధ్య కత్తులు కర్రలతో దాడి - పలువురికి గాయాలు**

**సూర్య జగిత్యాల**



జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం గణేశ్పల్లిలో శనివారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. కత్తులు, కర్రలు, రాళ్లతో ఇరు వర్గాలు దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో శ్రీకాంత్, గోవింద్, దేవేందర్, బక్కయ్య, సంతోష్, సాయి కృష్ణ, స్వామి విట్టల్, కృష్ణ, నారాయణ లకు గాయాలు కాగా క్షతగాత్రులను జగిత్యాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న సారంగపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే కుల సంఘం చిట్టీల విషయంలో ఓ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారని, దీంతో ఘర్షణ చెలరేగిందని స్థానికంగా చర్చ జరుగుతుంది. గాయపడ్డ వారిలో ఒకరి పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

## పెరుగుతున్న ఎండలు.. వృథాగా నీరు...

**సూర్య, మెట్ పల్లి టౌన్**



చలి తగ్గి ఎండలు పెరుగుతున్న వేల రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడుతున్నందున ప్రజల అవస రాల దృశ్య మిషన్ భగీరథ పైప్ లైన్ వేసి ప్రజల అవసరాలను తీర్చే పనిలో ఉన్నారు, కానీ పైన చిత్రాన్ని చూస్తే అది రోడ్డుపా లైనట్లుగా కనిపిస్తుంది. వివరాల్లోకి వెళ్తే పట్టణంలోని దుబ్బువాడకు చెందిన రహదారి లో మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలి గత వారం రోజుల నుండి వృధాగా నీరు పోతు ఉన్నది. దానిని పట్టించుకునే అధికారులు లేక వృధాగా నీరు పోతున్నాయని ప్రజలు అంటున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి నీటిని వృధా చేయకుండా ప్రజల అవసరాలు తీర్చాలని అధికారులను కోరారు.

## నేడే పల్స్ పోలియో

**- చిన్నారులందరికి పోలియో చుక్కలు వేయించాలి: డా.వాహిని**

**సూర్య మల్లాపూర్**



అప్పుడే జన్మించిన శిశువు నుండి ఐదేళ్ల చిన్నారులందరికీ నేడే తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని వాహిని తెలిపారు. మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించి పల్స్ పోలియో పై గ్రామాల్లో విస్తృత ప్రచారం జరిపించాలని అన్నారు. మండల వ్యాప్తంగా 32 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రజలు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సోమవారం, మంగళవారం ఇంటింటి సర్వే చేయాలని సూచించారు.




# కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన బిసి ఫెడరేషన్ కులాలు

**- పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు కృషి చేస్తాం.. - తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ప్రకటన**

**సూర్య పెద్దపల్లి**

కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని బీసీ ఫదరేషన్ కులాల సమితి ప్రకటించింది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బెల్లపు దుర్గారావు ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్ తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ రామగిరి లింగయ్య అధ్యక్షతన పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో పార్లమెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బెల్లాపు దుర్గారావు, కీర్తి



యుగంధర్ పార్లమెంట్ కమిటీని ప్రకటించారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జిగా గుడ్ల సమ్మయ్య, కన్వీనర్ గా డాక్టర్ రామగిరి లింగయ్య, కో కన్వీనర్లుగా ఆశాడపు లింగయ్య (పెద్దపల్లి), డాక్టర్ కేటీపీ రవీందర్ (మంథని), సూత్రపు పరమేశ్వర్ (పెద్దపల్లి), కావేటి సమ్మయ్య (మంథని), సిహెచ్ యాదమ్మ (గోదావరిఖని), పిట్ల లక్ష్మి (మంచిర్యాల), అంజయ్య చారి (పెద్దపల్లి), లను నియమించినట్లు ప్రకటించారు. త్వరలో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సలహాదారు అంబటి రవీందర్ రాజు, నాయి బ్రాహ్మణ సంఘం పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు సన్నాయిటెంకం సురేష్, సొన్నాయిటెంకం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## 15న భీమ్ జ్యోతి ర్యాలీ విజయవంతం చేయాలి



**సూర్య-పెద్దపల్లి రూరల్**

మాదిగలకు న్యాయంగా రావాల్సిన రాజకీయ వాటాను దక్కించుకునేందుకు ఈనెల 15న పెద్దపల్లిలో నిర్వహించనున్న భీమ్ జ్యోతి ర్యాలీ విజయవంతం చేయాలని మాదిగ శక్తి జిల్లా కన్వీనర్ కల్లెపల్లి రవి పిలుపునిచ్చారు. మాదిగ శక్తి వ్యవస్థాపకులు బొంకూరి సురేందర్ సన్ని అధ్వర్యంలో కాన్షిరామ్ జయంతిన జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ర్యాలీ కరపత్రాలను మండలంలోని రాఘవాపూర్ గుట్టవద్ద ఏర్పాటు చేయనున్న జాంబవ చక్రవర్తి విగ్రహ నిర్మాణస్థలం వద్ద శనివారం ఆవిష్కరించారు. ర్యాలీ పెద్దపల్లి కమాన్ చౌరస్తా నుండి జండా కూడలి కాన్షి రామ్ విగ్రహం వరకు కొనసాగుతుందని చెప్పారు. ర్యాలీకి తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ గజ్జెల కాంతం, మాదిగ జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర చైర్మెన్ సోమ చంద్ర శేఖర్, ఇతర మాదిగ సంఘాల నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సదయ్య, కుమ్మరి సందీప్, కుమ్మరి శ్రీశైలం, కల్లేపల్లి సతీష్, కల్లేపల్లి కిషోర్, కుమ్మరి మోహన్ బాబు, కుమ్మరి చిన్న సందీప్, కుమ్మరి శివ, మోధుంపల్లి చిన్న అంజయ్య, మోదుంపల్లి పర్వతాలు, తదితరులు పాల్గోన్నారు.

## ఉన్నత విలువలకు ప్రతిరూపం మాజీ స్పీకర్ శ్రీపాదరావు

**- సింగరేణి తరపున ఘన నివాళులు అర్పించిన సిఅండ్ఎండి ఎన్.బలరాం**

**సూర్య, సెంటినరీ కాలనీ**



ఉన్నత విలువలకు, నీతి నిజాయితీలకు ప్రతిరూపంగా మాజీ స్పీకర్ కీర్తిశేషులు దుద్దిళ్ళ శ్రీపాదరావు నిలుస్తారని, ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని సింగరేణి సంస్థ చైర్మన్ మరియు ఎండి నేనావత్ బలరాం నాయక్ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో శనివారం ఉదయం జరిగిన దుద్దిల్ల శ్రీపాదరావు జన్మదినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శ్రీపాదరావు తన రాజకీయ జీవితం మొత్తం ప్రజలకు అంకితం చేసి, ప్రజాసేవకే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారని, ప్రతిపక్షాలు కూడా ఆమోదించి ప్రశంసించిన స్పీకర్ గా చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఉన్నత విలువలకు పట్టం కట్టిన తెలంగాణ ప్రాంత నేతగా ఆయన ప్రజల మనసుల్లో చిరకాలం గుర్తుండిపోతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సంస్థ డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ (ఆపరేషన్స్ మరియు పర్సనల్) ఎన్.వి.కే.శ్రీనివాస్, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వర్ రెడ్డి, జే.ఆల్విన్, (ఈడి కోల్ మూమెంట్), జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్) ఎం.సురేష్, జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) దేవేందర్ ఇంకా ఇతరులు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లోనూ, కార్యాలయాల్లో కూడా శ్రీపాదరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**సూర్య ఓదెల**

ఓదెలలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 5 వ తేదీ నుండి 15 తేదీ వరకు జరగనుండడం తో, స్థానిక శాసనసభ్యులు విజయ రమణారావు ను శనివారం రోజు శివపల్లి లోని ఆయన స్వగృహంలో కలిసిన ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశం యాదవ్, ఈవో సదయ్య కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులతో కలిసి ఎమ్మెల్యే బ్రహ్మోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని, భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చింతం మొగిలి, కనికి రెడ్డి సతీష్, వెంకటస్వామి, ప్రధాన అర్చకులు వీరభద్రయ్య ,పంచాక్షరి , ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అందాన్ని అద్దంలో చూసుకుంటూ...మురిసిన కోతి

**సూర్య, సెంటినరీ కాలనీ**

కోతి తన అందాన్ని బైకు అద్దంలో చూసుకుంటూ మురిసిపోతున్న ఫోటో సూర్య క్లిక్ మనిపించింది. సెంటినరీ కాలనీ ఆర్జీ-3 జీ.ఎం కార్యాలయంలో మర్రి వృక్షం కింద ఉంచిన ఒక బైకు పైకి ఎక్కిన కోతి అద్దంలో చూసుకుంటూ మురిసి పోయింది.



## అధికారికంగా శ్రీపాదరావు జయంతి

**సూర్య జూలపల్లి**



మండలంలో శాసనసభ మాజీ స్పీకర్ దిగంగత శ్రీపాదరావు జయంతిని అధికారికంగా నిర్వహించారు.ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడిన గొప్ప వ్యక్తి దుద్దిళ్ల శ్రీపాదరావు అని తహసిల్దార్ బషీరుద్దీన్ అన్నారు. శనివారం తహసిల్దార్ కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసన సభ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో పద్మజ ఆధ్వర్యంలో శ్రీపాదరావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధికారులు మాట్లాడుతూ మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, ధూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాలరావు,కాంగ్రెస్ నాయకులు గండు సంజీవ్,మానుమండ్ల శ్రీనివాస్, ఫకీర్ మహమ్మద్, కొమ్మ రాజేశం, నాయబ్ తహసిల్దార్ అబుబాకర్,కార్యాలయల సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీపాద రావు జయంతి వేడుకలు

**సూర్య-పెద్దపల్లి రూరల్**



మదర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రముఖ మాజీ శాసనసభ్యుడు, శాసనసభ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాద రావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల యాజమాన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎడవల్లి కృష్ణ , చైర్మన్ ఎడవల్లి నవీన్ కుమార్ , డైరెక్టర్ నవత ల సూచన మేరకు ప్రిన్సిపాల్ తొడుపునూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీపాద రావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు దుదిల్ల శ్రీపాద రావు సేవలను గుర్తుచేసుకున్నారు. 1935లో మంథని నియోజకవర్గంలో జన్మించిన శ్రీపాద రావు మంథని నియోజకవర్గానికి మూడుసార్లు ఎమ్మెల్యేగా మరియు మన ఉమ్మడి ఆంధ్ర రాష్టానికి స్పీకర్గా ఎంతో సేవలు చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు,అకౌంట్స్ ఆఫీసర్ పవన్ కుమార్ టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## దివంగత మాజీ స్పీకర్ జయంతి వేడుకలు

**సూర్య-పెద్దపల్లి రూరల్**



పెద్దపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీ పాద రావు జయంతి వేడుకలు తహశీల్దార్ లు సునీత, బండి ప్రకాష్, ఇంచార్జి తహశీల్దార్ తిరుపతి ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పాద రావు చిత్ర పటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లు రవీందర్, షఫీ,రాములు, ఆర్ ఐ లు నవీన్ రావు, ఇంతియాజ్, సతీష్ విఆర్ ఏ కిరణ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఉద్యమకారుల కృతజ్ఞత సభ

**సూర్య ఓదెల**

ఓదెల మండల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 12 న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతా సభ ఏర్పాటు చేయడం జరిగిందని కావున జిల్లాలో నీ ఉద్యమకారులు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. స్వరాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను త్యాగం చేసిన రాష్ట్రం వచ్చిన తర్వాత అన్యాయానికి గురైన ఉద్యమకారులకు న్యాయం చేస్తామని, ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం 250 గజాలు ఇంటి స్థలాన్ని ఇచ్చి ఉద్యమాలకారుల ఆత్మగౌరవాన్ని నిలబెడతామని, ఉద్యమకారులకు అండదండగా ఉంటామని చెప్పడం పట్ల ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ముద్దమల్ల రమేష్, కాంతాల సమ్మిరెడ్డి, పెద్దిరెడ్డి రాజిరెడ్డి ,గాజుల శివశంకర్, అలిగి వెల్లి రవీందర్ రెడ్డి, కర్రే లక్ష్మారెడ్డి, పలకల కర్ణాకర్ రెడ్డి, తుమ్మల కొండయ్య ,మాచర్ల రవీందర్, చింతకుంట వెంకటరెడ్డి, లింగాల జనార్ధన్ రెడ్డి, సంతోష్, బండారి తిరుపతి, కొత్తిరెడ్డి మల్లారెడ్డి, పెరుమాండ్ల ఐలయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

**- కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం - ఇచ్చిన హామీల్లో నాలుగు అమలు - అభివృద్ధిని చూసి హస్తం గూటికి**
**- గతంలో మీ ప్రోటోకాల్ ఎమైంది: జువ్వాడి నర్సింగరావు**

**సూర్య మల్లాపూర్**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ప్రజాభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం కొమిరెడ్డి కరంచంద్, జువ్వాడి కృష్ణారావు, స్థానిక నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీల్లో ఇప్పటికే నాలుగు అమలులోకి వచ్చాయాన్నారు. స్త్రీల కు ఉచిత బస్సు సౌకర్యం, 200యునిట్ల ఉచిత



కరెంటు, ఆరోగ్య శ్రీ పరిమితి పెంపుదల, ధరని లోని సమస్య ల పరిష్కారం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గడిచిన రెండు వారాల్లోనే ఆయా గ్రామాల్లో ఎన్ఆర్ఈజిఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్లు వేయించడం జరిగిందని గత ప్రభుత్వం లాగా సగంసగం కాదు నాణ్యతతో కూడిన నిర్మాణ పనులు చేస్తున్నామన్నారు. అభివృద్ధిని చూసి హస్తం గూటికి వచ్చిన బిఆర్ఎస్, బిజెపి పార్టీ ల నాయకులకు పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. అనంతరం కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రోటోకాల్ పై చేసిన వాక్యాలను ఖండించారు. గతంలో మీ ప్రోటోకాల్ ఏమైంది ప్రభుత్వ కార్యక్రమాల్లో అనాధికార పంపిణీలు ఎలా చేసారు. స్థానికంగా వున్న నాయకులను గుర్తించని మీకు ప్రోటోకాల్ పై ప్రస్తావించే హక్కు లేదన్నారు.జడ్పిటిసి సభ్యుడు జలపతి రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి సత్యనారాయణజెట్టి లింగం పూదరి నర్సాగౌడ్ బాపురెడ్డి కడకుంట్ల సాయి లక్ష్మారెడ్డి మల్లయ్య పోతు శేఖర్ మల్లారెడ్డి నందు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా బండి సంజయ్‌ను ప్రకటించడంపై బిజెపి శ్రేణులసంబరాలు



**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం పోటీ చేసే అభ్యర్థుల మొదటి జాబితాలో బండి సంజయ్ కుమార్ పేరు ప్రకటించడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బిజెపి శ్రేణులు సంబరాలు నిర్వహించారు. హుజురాబాద్ మండలంలోని చెల్పూర్ లో జరుగుతున్న ప్రజాహిత యాత్ర లో ఉన్న బండి సంజయ్ కుమార్ ను బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కరీంనగర్ బీజేపీ అసెంబ్లీ శ్రేణులు తెలంగాణ చౌక్ లో టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రజాహిత యాత్రలో ఉన్న బిజెపి నాయకులు, కార్యకర్తలు జమ్మికుంట లోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులందరూ వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరు బండి సంజయ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి బోయిన్పల్లి ప్రవీణ్ రావు, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి, సంపత్ రావు,కటకం లోకేష్, దుర్శెట్టి సంపత్, దూల శ్రీనివాస్, ఎండి ముజీబ్, ఉప్పరపల్లి శ్రీనివాస్, బొంతల కళ్యాణ్ చంద్ర, యువ క్రాంతి, ఈసంపల్లి మహేష్ , సంతోష్, కుమార్, శ్రీకాంత్, తోట అనిల్, తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్సీ ని కలిసిన నాగాలయ నూతన కమిటీ సభ్యులు



**సూర్య,రాయికల్**

మండలం లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొత్తపేట శ్రీ రాజరాజేశ్వర నాగా లయ ఉత్సవ కమిటీ నూతన పాలకమండలి సభ్యులు శనివారం కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ టీ. జీవన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నూతన పాలకమండలి ఏర్పాటుకు కృషి చేసినందుకు కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని, అలాగే మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దానవేణి రాములు యాదవ్, సభ్యులు బొంగొని భూమ గౌడ్,ఏనుగు నాగిరెడ్డి, ముక్కెర ముత్యం,వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి జువ్వాడి పరామర్శ

**సూర్య మల్లాపూర్**



మండలకేంద్రానికి చెందిన గోదూరి మోహన్ రెడ్డి ఇటీవల అనారోగ్యం తో మరణించగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మృతుడి కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. కుటుంబానికి అండగా వుంటామని అన్నారు. వీరివెంట నాడు కాంగ్రెస్ పార్టీ మాజీ జెడ్పిటిసి జలపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పుంద్ర శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, జీవన్ రెడ్డి,మారుతి, గోదూర్ సంజీవ్ రెడ్డి తదితరులు వున్నారు.

## మైక్రో బయాలజీ ల్యాబ్ ప్రారంభం

**సూర్య, హుజురాబాద్ రూరల్:**



హుజురాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్ద గల నాగార్జున డైరీలో శనివారం పాల నాణ్యతను తెలిపే మైక్రో బయాలజీ ల్యాబ్ ను నాగార్జున డైరీ వ్యవస్థాపకులు మేనేజింగ్ డైరెక్టర్ పుల్లూరి ప్రభాకర్ రావు దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల పదార్థాల నాణ్యతను తెలుసుకోవడానికి లక్షలాది రూపాయల వ్యయంతో ఈ ల్యాబ్ ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నాణ్యత చూపి ప్రజల మన్నన పొందుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గణేష్ రావు, అహల్య, శృతి, ప్రవళిక, రజనీకాంత్, సుధాకర్, పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**-మెట్ పల్లి ప్రాజెక్ట్ సిడిపిఓ తిరుమల దేవి**

**సూర్య -కోరుట్ల**



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మెట్ పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ తిరుమల దేవి అన్నారు. శనివారం పట్టణంలోని రహమత్ పుర-1 అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని సిడిపిఓ మాట్లాడారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో రాణించగలుగుతారని అన్నారు. ఆరోగ్యంగా ఎదగాలంటే అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పౌష్టిక ఆహారాన్ని తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మహిళల కు బాలికల కు ప్రభుత్వం ఇస్తున్న భద్రత పై కూడా అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లను వినియోగించుకొని తమను తాము రక్షించుకోవాలని ఆమె కోరారు. ఈ సమాజంలో మహిళల పాత్రే కీలకమని అందుకే మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు హేమలత, షైనీలు అంగన్వాడి టీచర్లు కల్వకోట ప్రేమలత, చింతా అరుణ, లక్ష్మి, హిమగిరి మహిళలు పాల్గొన్నారు.

## అవార్డుతో పెరిగిన మరింత బాధ్యత

**- ప్రభాకర్ రావు**

**సూర్య, హుజురాబాద్ రూరల్**



ఉత్తమ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు పొందడంతో మరింత బాధ్యత పెరిగిందని నాగార్జున డైరీ ఎండి పుల్లూరు ప్రభాకర్ రావు అన్నారు. శనివారం హుజురాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్ద గల నాగార్జున డైరీలో ఉత్తమ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు పొందిన మిత్రులు, ఉద్యోగులు ఎండి ప్రభాకర్ రావుకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరీ ని స్థాపించిన నాటి నుండి పట్టుదలతో మంచి ఫలితాలు సాధించడానికి నాణ్యత పరమైన లోపాలు లేకుండా ప్రయత్నిస్తూ నడిపిస్తున్నానని అన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ ప్రజలకు అందుబాటులో డైరీ ఉత్పత్తులను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ కు చెందిన షిఫ్ట్ అండ్ లిఫ్ట్ మీడియా సంస్థ అవార్డు ప్రకటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఉద్యోగుల యాజమాన్య సమిష్టి కృషితో 18 సంవత్సరాలుగా డైరీ ప్రజల మన్నలను పొందుతుందని, రాబోయే కాలంలో మరింత ఉన్నతంగా నడిపిస్తామని ఆయన అన్నారు. పాల పదార్థాలు ఉత్పత్తి చేయడమే కాకుండా వాటిలో నాణ్యత పాటిస్తూ ప్రజా మద్దతు పొందుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరీ డైరెక్టర్ పుల్లూరి గణేష్ రావు, శృతి, ఎస్సారెస్పీ నీటి సంఘ మాజీ అధ్యక్షులు చోల్లేటి కిషన్ రెడ్డి, ప్రభుత్వ సహాయ న్యాయవాది కేతిరి శ్రీనివాస్ రెడ్డి, సీఈఓ ప్రసాద్, ఏజీఎం సుధాకర్, రజినీకాంత్ రెడ్డి, కోటేశ్వరరావు, ధర్మారెడ్డి, సృజన్, రాజన్న, కుటుంబ సభ్యులు, ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపాదరావు విగ్రహానికి నివాళి ఘటించిన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్

**సూర్య-గోదావరిఖని**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసన సభాపతి గా, బడుగు, బలహీన వర్గాల ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న దివంగత కాంగ్రెస్ పార్టీ నేత శ్రీపాదరావు విగ్రహానికి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ పూలమాలవేసి నివాళి ఘటించారు. ఈ మేరకు శనివారం శ్రీపాదరావు జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ శ్రీపాదరావు అజాత శత్రువని అభివర్ణించారు. శ్రీపాద రావు పేరును మంత్రి శ్రీధర్ బాబు నిలబెడుతున్నారని కొనియాడారు. ఆలస్యమైనా శ్రీపాదరావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపడం చాలా సంతోషంగా ఉందని, శ్రీపాదరావు మకుటం లేని రాజకీయ నాయకుడని, పేద ప్రజల పెన్నిధి అని చెప్పుకొచ్చారు. తన రాజకీయ జీవితం ప్రజాసేవకే అంకితం చేసిన గొప్ప నాయకుడు శ్రీపాద రావు అని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఎమ్మెల్యే వెంట నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు. అదేవిధంగా దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు బొంతల రాజేష్, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, చుక్కల శ్రీనివాస్, బొమ్మక రాజేష్, నాయిని ఓదెలుయాదవ్, కొప్పుల శంకర్, సింహాచలం, ఆడెపు రవి, అనుమ సత్యనారాయణ, బూర్ల శ్రీనివాస్, ఎండ గౌస్, మాలెం మధు, గడ్డం సతీష్, బోయిని మల్లేష్‌యాదవ్, కారం వినయ్, దశరథం, తోట లక్ష్మణ్, రంజిత్ నారాయణ, నాజీమోద్దీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

## గేదెలు మేపడనికి వెళ్ళి మృతి

**సూర్య, మెట్ పల్లి టౌన్**



మండలంలోని వేంపేట్ గ్రామానికి బతుకుతెరువు కోసం వచ్చిన స్వామి శుక్రవారము గేదెలు మేపాడానికి వెళ్లి మరణించినట్లు ఎస్సై.చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోడి స్వామీ(44) కొమ్ముగూడెం (గ్రా), లక్షట్ పేట్ (మ%శీ%), మంచిర్యాల (జి) చెందిన స్వామి బతుకు తెరువు కోసం మండలంలోని వేంపేట్ గ్రామానికి వచ్చి గ్రామంలోని గేదెలు మెపడనికి పనికి కుదుర్చుకున్నాడు. కానీ శుక్రవారము గేదెలు గ్రామంలోని మాదన్న చెరువు సమీపంలో చెరువులో నీళ్లు తాగడానికి వెళ్లినా గేదెలను తరుముకుంటూ వెళ్లిన స్వామి చెరువు గల లోతుగా ఉన్న నీటి మట్టణ మునిగి ఊపిరి అడక చనిపోయాడు.స్వామి భార్య అయిన కోడి ప్రేమల కూ,పోలీసులకు స్థానికులు తెలిపారు.వెంటనే ప్రేమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

**- కలెక్టర్ అనురాగ్ జయంతి — సైన్స్ ఎగ్జిబిషన్ సందర్శన**

**సూర్య రాజన్న సిరిసిల్ల.**

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకాంక్షించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్ స్కూల్ కాంప్లెక్స్ స్థాయి సిరిసిల్ల పట్టణం కుసుమరామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 154 ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన హ్యూమన్ హెల్పింగ్ రోబోట్,ఆటో హోమ్ మిషన్, ఆర్ ఎఫ్ఐడీ అటెండెన్స్, రెయిన్ వాటర్ స్టోరేజ్, లెట్ డెత్ పీపుల్ అలర్ట్, చంద్రయాన్ తదితర ప్రాజెక్ట్ లను కలెక్టర్ పరిశీలించి, వాటి ఉపయోగం విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుల తయారీకి సహకరించిన గైడ్ టీచర్స్, ప్రాజెక్టుల ను వివరించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు చక్కటి ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. చదువులోనూ రాణించాలని పేర్కొన్నారు.





**-విజేతలు వీరే..**

ఆర్ఎఫ్ఐడీ అటెండెన్స్ సిస్టం రూపొందించిన చేర్యాల శివతేజ, వడ్డేపల్లి లవన్ కుమార్, హ్యూమన్ హెల్పింగ్ రోబోట్ రూపొందించిన జీ సాయి తేజ, అజయ్,ఆటో హోమ్ మిషన్ ప్రదర్శించిన బీ అఖిల, జాబిల్లి లతోపాటు రెయిన్ వాటర్ స్టోరేజ్ సిస్టం ప్రదర్శించిన శివ, దత్రిష్, వివేక్ డెఫ్ పీపుల్ అలర్ట్ సిస్టం ప్రదర్శించిన రాజేశ్వరి, వర్షితలను విజేతలుగా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, కౌన్సిలర్ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోతిలాల్, మండల విద్యాధికారి దూస రఘుపతి, పాఠశాల స్టాఫ్ సెక్రెటరీ మల్లారపు పురుషోత్తం, సైన్స్ ఉపాధ్యాయులు పాకాల శంకర్ గౌడ్ సరిత, శ్రీహరి, రజిత, అజయ్ తదితరులు పాల్గొన్నారు.




## ఓటు హక్కు వినియోగంపై అవగాహన

**-స్వీప్ ఆద్వర్యంలో శిక్షణ**

**సూర్య రాజన్న సిరిసిల్ల.**



రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) ఆద్వర్యంలో శనివారం శిక్షణ ఇచ్చారు. సిరిసిల్లలోని నర్సింగ్ కళాశాల, వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలోని పాలిటెక్నిక్ కళాశాల, తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి, జిల్లెల్ల లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వోటర్ హెల్ప్ లైన్ యాప్ లో అందుబాటులో ఉన్న సేవలు, ఓటు హక్కు నమోదుకు అర్హత వయసు, ఆన్లైన్, ఆఫ్ లైన్ లో ఓటు హక్కు ఎలా నమోదు చేయాలి, ఫారం నెంబర్ 6,7,8 వినియోగం, ఓటు హక్కు నమోదులో తరచూ చేసే తప్పులు ఎలా నివారించాలి తదితర అంశాల పై వివరించారు. అనంతరం అధికారులు మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామాలు, పట్టణాల్లో ఓటు హక్కు వినియోగించు కునేలా విద్యార్థులు అవగాహన కల్పించాలని కోరారు.

## నకిలీ పత్రాలు సృష్టిస్తే కఠిన చర్యలు.

**- మీసేవ కేంద్రాలకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరిక**

**సూర్య రాజన్న సిరిసిల్ల.**



నకిలీ గుర్తింపు కార్డులు సర్టిఫికెట్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లాలోని మీసేవ కేంద్రాల యజమానులకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరికలు జారీ చేశారు. పాస్ పోర్ట్ దరఖాస్తు విషయంలో తప్పుడు ధ్రువీపత్రాలు సృష్టించి ప్రభుత్వ ఉద్యోగులను తప్పు ద్రోవపట్టించిన కథలపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి తోపాటు మీసేవ కేంద్రం యజమాని పై రుద్రంగి పోలీస్ లు కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు. నిందితుల వద్ద నుండి కంప్యూటర్, స్కానర్, ప్రింటర్, ల్యాప్ టాప్,ఆధార్ కార్డ్ ఒరిజినల్,నకిలీ ఆధార్ కార్డ్ స్వాధీనం చెసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా ఎస్పీ వివరించారు.కథలపూర్ మండల కలికోట గ్రామానికి చెందిన దారవత్ షెర్మాన్ అనే వ్యక్తి గతంలో ఉపాధి నిమిత్తం విదేశాలు వెళ్లి అక్కడ జైలు శిక్ష అనుభవించి స్వదేశానికి తిరిగి వచ్చాడు. మరోసారి విదేశాలకు వెళ్లాలని అనుకోని దరఖాస్తు చేసుకోగా జిల్లా స్పెషల్ బ్రాంచ్ పాస్ పోర్ట్ ఎంక్వయిరీ లో భాగంగా దారవత్ షెర్మాన్ సమర్పించిన పత్రాలు నకిలీవని తేలింది. స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ దేవరాజుకు కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రుద్రంగి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి నకిలీ పత్రాలు సమర్పించిన దారవత్ షెర్మాన్ తోపాటు రుద్దంగిలోని గాయత్రీ మీసేవా కేంద్రం యజమాని లోలావత్ పరమ్‌జిత్ లను అరెస్టు చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు.

## సోమేశ్వర జాతర మహోత్సవ గోడ పత్రిక ఆవిష్కరణ

**సూర్య మల్లాపూర్**



మండల కేంద్రంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ కనక సోమేశ్వరుడి జాతర మహోత్సవం మహాశివరాత్రి సందర్భంగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. కాగా ఈనెల 8వ తారీఖున ప్రారంభమయ్యే జాతర ఉత్సవాల నిర్వహణకు సంబంధించి గోడపత్రిక లను ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి ప్రజా ప్రతినిధులు,శివ దీక్ష స్వాములతో శనివారం ఆవిష్కరించారు.

## వైస్ ఎంపీపీ రాజీనామా

**సూర్య వేములవాడ**

వేములవాడ అర్బన్ మండల వైస్ ఎంపీపీ రేగులపాటి రవిచందర్ రావు తన వైస్ ఎంపీపీ పదవికి శనివారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో కార్యాలయంలో జడ్పిటిసి మ్యాకల రవి ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు సమక్షంలో అందజేశారు. అయితే కొన్ని రోజుల క్రితం వైస్ ఎంపీపీ పై పలువురు ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రకటించిన విషయం తెలిసిందే.

## ఘనంగా దుద్దిల్ల శ్రీపాద రావు జయంతి వేడుకలు

**సూర్య బోయినపల్లి**



బోయినపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం శ్రీపాదరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి పర్లపల్లి వేణుగోపాల్ శ్రీపాద రావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపిపి పర్లపల్లి వేణుగోపాల్ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్న శ్రీపాద రాజకీయాల్లోకి అడుగిడాలని స్నేహితులు, హితులు ప్రోత్సాహించారు. ఆ దిశగా అడుగులు వేస్తూ పోటి చేసి మొదటిసారి సర్పంచ్ గా ఎన్నుకోబడ్డారన్నారు.వరుసగా మరో మారు ఆయనకే ప్రజలు మద్దతు పలకడంతో రెండవ సారి కూడ ఎన్నికయ్యారు. మహాదేవపూర్ సమితి అధ్యక్షునిగా ఎన్నికైన తరువాత ఎల్ ఎం బి ఛైర్మన్ పదవికి మంథని నుండి గెలిచారు. ఆయన రాజకీయ ఎదుగుదలకు ఎల్ ఎం బి బ్యాంకు ఛైర్మన్ ఎన్నిక ఎంతో సహకరించింది. దీంతో పూర్తిగా నియోజకవర్గానికే ఆయన సుపరిచితమైనాడు. పదవివస్తే ముఖంచాటు చేసుకునే నాయకులకు భిన్నంగా అయన ప్రజల మధ్యనే ఉంటూ, వారి కష్ట, నష్టాలలో పాలు పంచుకొని ప్రజానాయకునిగా ఎదిగారు. 1984 ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ నుండి మంథని శాసనసభ నియోజకవర్గం నుండి ఏమ్మెల్లెగా పోటి చేసే అవకాశం లభించింది. ఈ ఎన్నికల్లో శ్రీపాదరావు విజయం సాధించారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు శాసన సభ్యులుగాఎన్నికైన ఆయనకు శాసనసభ స్పీకర్ గా అన్ని పార్టీల మద్ధతుతో పదవి నదిష్టించారు. మంథని ప్రాంతంలో అభివృదిపరిమళాల పరంపర ప్రారంభం అయింది అంటే శ్రీపాద రావు స్పీకర్ ఉన్న సమయంలోనే అని చెప్పుకోవచ్చని అన్నారు. ఆయన మరణించిన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశీల, సేస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి,ఏపివో సబితా ,నాయకులు కొంకటి మధుకర్,మిట్టపెల్లి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## పరమార్శ

**సూర్య ధర్మపురి**



వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దేవి అంజలి తల్లి లక్ష్మీ ఇటీవల మరణించగా శనివారం వారి కుటుంబాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. వీరి వెంట మున్సిపల్ చైర్మన్ సంగి సత్యమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేష్, జెడ్పిటిసి బత్తిని అరుణ, ఎంపీటీసీ అనంతుల విజయలక్ష్మి, కౌన్సిలర్ గుర్రాల రాజేందర్, నాయకులు జెట్టి రాజన్న, గద్దం బాలరాజ్ లు ఉన్నారు.

## సెస్ సంస్థకు పునర్ వైభవం తీసుకొస్తాం

**- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు**

**సూర్య రాజన్న సిరిసిల్ల**



సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ సెస్ కు పునర్వైభవం తీసుకొస్తామని సంస్థ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. శనివారం సిరిసిల్లలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రామారావు మాట్లాడు తూ గత 53 సంవత్సరాలుగా సెస్ సంస్థ సిరిసిల్ల ప్రజల సేవలందిస్తోందన్నారు.సంస్థలో ఎలాంటి అవినీతిని జరగలేదని సహకార చట్టాల ప్రకారమే సంస్థ నడుస్తోందని వెల్లడించారు. పత్రికలు సంస్థ ప్రతిష్టకు నష్టం కలిగేలా వార్తలు రాయొద్దని ఈ సందర్భంగా చిక్కాల రామారావు విలేకరులను కోరారు. అలాంటి వార్తల వల్ల సంస్థపై వినియోగదారుల నమ్మకం కోల్పోతారని, సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. ఇటీవల తెలంగాణ విద్యుత్ నియంత్రణ సంస్థ( ఇ ఆర్ సి) తన నివేదికలో సెస్ సంస్థను ఎన్ పి డీ సీ ఎల్ లో విలీనం చేయమని ప్రభుత్వానికి సలహా మాత్రమే ఇచ్చిందన్న ఆయన ఈఆర్సీ నివేదికలో సంస్థ నష్టాలపై ఇచ్చిన సూచనలపై దృష్టి సారించామన్నారు. మరో ఆరు నెలల్లో సంస్థకు పునర్ వైభవం తీసుకువచ్చే దిశ తమ పాలకవర్గం కృషి చేస్తుందని రామారావు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సెస్ సంస్థను ఎన్ పి డి సి ఎల్ లో విలీనం చేస్తుందని తామనుకోవడం లేదని, సహకార సంస్థ కాపాడేందుకు సానుకూలంగా స్పందిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. తమ పాలకవర్గం పదవిలోకి వచ్చిన తర్వాత సంస్థలో అనేక మౌలిక మార్పులు తీసుకొచ్చామని, ఒకేసారి విధుల్లో నిర్లక్ష్యం వహించిన 13 మంది సిబ్బందిపై చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. కనెక్షన్ల కేటగిరీలలో జరిగిన అవకతవకలపై దృష్టి సారిస్తున్నామని, ఇప్పటికే 80 శాతానికి పైగా సరి చేశామని రామారావు వెల్లడించారు. దశలవారీగా ఈ ఆర్ సి ప్రస్తావించిన అన్ని సూచనలను పరిగణలోకి తీసుకొని సంస్థను మరింత పటిష్టం చేస్తామని రామారావు అన్నారు. దేశంలోనే విజయవంతంగా నడుస్తున్న సహకార విద్యుత్ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత వినియోగ దారులు అందరిపై ఉందని,సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించాలని ఆయన కోరారు

# చెందుర్తిలోకనుమరుగైన కుంటలు

**- కనుమరుగైన కర్ణం కుంటతో బోసిపోయిన పల్లె అందాలు - దగ్గర పడుతున్న ధర్మారావు కొచ్చెరువు**

**సూర్య చందుర్తి**

చందుర్తి మండల కేంద్రంలోని స్థానిక కర్ణం కుంట కొత్త కుంట అలాగే కుంటలలోకి నీరు వచ్చే ఒర్రెలు కనుమరుగవడంతో పాటు కొత్త కుంట దాదాపు 5 ఎకరాల భూమి కర్ణం కుంట 2ఎకరాల భూమి కనబడకుండా కబ్జా కు గురైంది అని గ్రామానికి చెందిన పలువురు ఆరోపిస్తున్నారు అలనాటి కాలంలో కర్ణం కుంటలో ఉన్న కర్నాల బావి బావి పక్కన ఉన్న మేడి చెట్టు కుంట కట్టమీద ఉన్న ఊడలమర్రి ఊడల మర్రి కింద పిల్లలు ఆడుకుంటే చూడముచ్చటగా ఉండేదని కర్ణం కుంట వర్షాకాలంలో వర్షాలకు నిండి నిండుకుండలా ఉండి బతుకమ్మ పండుగలకు బతుకమ్మల నిమజ్జనానికి తోడ్పడడమే కాకుండా పల్లె అందాలను తెచ్చి పెట్టిందని కొందరు అలనాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకుంటున్నారు అట్టి అందాలను తెచ్చి పెట్టిన కర్ణం కుంట మధ్యలో నుండి శ్రీపాద ఎల్లంపల్లి వరద కాలువ తీయడంతో కర్ణం కుంట కనుమరుగై పల్లెకు దూరమైందని ఎంత దూరంలో ఉన్న దసరా



బతుకమ్మ పండగలకు వచ్చిన ప్రజలను కర్ణం కుంటముగ్గలను చేసేదని ఇప్పటి కాలంలో కుంట లేకపోవడంతో ఆ కుంటలోనే డంపింగ్ యార్డ్ స్మశాన వాటికలను ఏర్పాటు చేయడంతో ప్రజల ఆనందం పోయి దుఃఖం మిగిలిందని ఇట్టి కుంటలో 2 ఎకరాల భూమి వరకు కబ్జా కాబడిందని కుంట కనుమరుగైనప్పటికీ కుంటలో కార్యాలయాలను నెలకొల్పినట్లయితే బాగుండేదని గ్రామానికి చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కొత్త కుంట లో ఉన్న భూమి మొత్తం కబ్జా గురై కట్ట మాత్రమే మిగిలిందని దీనితో భూగర్భ జలాలు అంతరించిపోయి పంట పొలాలకు ఇబ్బందిగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు ఇదిలా ఉండగా గ్రామానికి అప్పటి పెద్ద చెరువు అయినా ధర్మారావు కొచ్చెరువు చుట్టుపక్కల కబ్జా గురై అది కూడా కనుమరుగవ్వడానికి దగ్గరగా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు ఇదంతా జరిగిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని పోయిన కుంటలు ఎలాగో పోయినాయి ఉన్న చెరువునైనా కాపాడుకుంటే బాగుండునని ప్రజలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గత రెండు సంవత్సరాల క్రితం మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు సహకారంతో స్థానిక నాయకులు ప్రస్తుత సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు చెరువు పునర్నిర్మాణ పనులు చేద్దామని ముందుకు వస్తే పలువురు తమ స్వార్ధ రాజకీయాల కోసం భూ కబ్జా కొరకు కొందరు పనులు చేయకుండా చేశారని కొంతమంది రైతులు ఆరోపించారు ఇప్పటికైనా అధికారులు నాయకులు చొరవ తీసుకొని చెరువు మరమ్మతులు చేపట్టి భూగర్భ జలాలు అంతరించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు అంటున్నారు

## భీమ్ జ్యోతి ర్యాలీ విజయవంతం చేయాలి

**సూర్య పెద్దపల్లి**

మాదిగలకు న్యాయంగా రావాల్సిన రాజకీయ వాటాను దక్కించుకునేందుకు ఈనెల 15న పెద్దపల్లిలో నిర్వహించనున్న భీం జ్యోతి ర్యాలీ విజయవంతం చేయాలని మాదిగ శక్తి జిల్లా కన్వీనర్ కల్లెపల్లి రవి పిలుపునిచ్చారు. మాదిగ శక్తి వ్యవస్థాపకులు బొంకూరి సురేందర్ సన్ని అధ్వర్యంలో కాన్షిరామ్ జయంతిన జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ర్యాలీ కరపత్రాలను మండలంలోని రాఘవాపూర్ గుట్టవద్ద ఏర్పాటు చేయనున్న జాంబవ చక్రవర్తి విగ్రహ నిర్మాణస్థలం వద్ద శనివారం ఆవిష్కరించారు. ర్యాలీ పెద్దపల్లి కమాన్ చౌరస్తా నుండి జండా కూడలి కాన్షి రామ్ విగ్రహం వరకు కొనసాగుతుందని చెప్పారు. ర్యాలీకి తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ గజ్జెల కాంతం, మాదిగ జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర చైర్మెన్ సోమ చంద్ర శేఖర్, ఇతర మాదిగ సంఘాల నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సదయ్య, కుమ్మరి సందీప్, కుమ్మరి శ్రీశైలం, కల్లేపల్లి సతీష్, కల్లేపల్లి కిషోర్, కుమ్మరి మోహన్ బాబు, కుమ్మరి చిన్న సందీప్, కుమ్మరి శివ, మోధుంపల్లి చిన్న అంజయ్య, మోదుంపల్లి పర్వతాలు, తదితరులు పాల్గన్నారు.

## ఘనంగా దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి వేడుకలు

**సూర్య వీణవంక**



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం వీణవంక మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో స్వర్గీయ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు 85 వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారి కె. ప్రభాకర్ తో సిబ్బంది చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## ఒకే ఊరి యువతులు.... గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు.

**సూర్య జగిత్యాల**





జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన యువతులు గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు. గ్రామానికి చెందిన ఏనుగుర్తి దివ్య, బాదినేని శిరీష లకు టి జి టి బయాలజికల్ సైన్స్ లో 2023 సంవత్సరంలో గురుకుల ఉద్యోగ పరీక్షలు రాసి విజయం సాధించి ఉపాధ్యాయురాలుగా ఎంపిక అయ్యారు. వీరిద్దరిని గ్రామ ప్రజలు అభినందించారు.

## నాల్గు ఉజ్యోగాల అర్హత సాధించిన యువకుడు

**సూర్య మేడిపల్లి/బీమారం**



మండల కేంద్రానికి చెందిన బస్వరాజు రాజేష్ టీ జీ టీ, పీ జీ టి,డీ ఎల్,జే ఎల్,నాల్గు ప్రభుత్వ ఉజ్యోగాలకు అర్హత సాధించడం పట్ల గ్రామ యువకులు హర్షం వ్యక్తం చేస్తూ రాజేష్ ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు,ప్రజలు పాల్గొన్నారు.

## రేపటి పల్స్ పోలియోను విజయవంతం చేయండి

**సూర్య మేడిపల్లి**



మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఆదివారం రోజు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శి ఇసాక్ అన్నారు.పల్స్ పోలియో కేంద్రాలు గ్రామ పంచాయతీ కార్యాలయం,డి పీ ఈ పీ ప్రైమరీ పాఠశాలలో పల్స్ పోలియో చుక్కలు 0బి5సంవత్సరాల మీ పిల్లలందరికీ పల్స్ పోలియో 2చుక్కలు వేయించాలని తెలుపుతూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తార్,ఏ ఎన్ ఎం సత్యవతి,ఆశా వర్కర్లు భాగ్య, వాణీ,అంగన్వాడీ రేణుక,వి ఓ సత్యం రావు,గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఏ ఎస్ ఐ మృతి

**సూర్య -కోరుట్ల**



కోరుట్ల పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏ ఎస్ ఐ లోకిని రాజేందర్ (53 )గుండెపోటుతో శనివారం చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి విధులు పూర్తి చేసుకుని ఇంటికి చేరుకున్నారు .11 గంటల సమయంలో ఆయనకు గుండె నొప్పి రావడంతో వారి కుటుంబ సభ్యులు హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో మళ్లీ ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజేందర్ మొదటగా కానిస్టేబుల్ గా పోలీస్ ఉద్యోగం పొంది హెడ్ కానిస్టేబుల్ గా,ఏ ఎస్ ఐ గా పదోన్నతులు పొందినారు .గత రెండు సంవత్సరాల నుండి కోరుట్ల పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన చనిపోయిన విషయం తెలుసుకున్న ఎస్సై కిరణ్ కుమార్ తో పాటు సిబ్బంది ఆయన ఇంటికి వెళ్లి భౌతిక గాయానికి నివాళులర్పించారు.

## దివంగత స్పీకర్ శ్రీ పాదరావు జయంతి వేడుకలు

**సూర్య చొప్పదండి**



దివంగత మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీ పాదరావు జయంతి వేడుకలు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్బంగా శ్రీ పాదరావు చిత్ర పటానికి నివాళులు అర్పించారు.అనంతరం మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడు, న్యాయ వాది అయిన శ్రీ పాదరావు స్పీకర్ గా పని చేస్తూనే ప్రముఖులు, విశ్లేషకుల ప్రశంసలు అందుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ గుర్రం నీరజ భూమారెడ్డి, కౌన్సిలర్ లు కొట్టె అశోక్, మాదూరి శ్రీనివాస్, పెరుమాళ్ళ గంగయ్య, మేనేజర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలకు వినతిపత్రం

**సూర్య శంకరపట్నం**

మండల పరిధిలో ముత్తారం గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన నిర్మాణం కై నిధులు మంజూరు చేయాలంటూ శనివారం నాడు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వినతి పత్రం అందజేసిన ,ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కనకం విద్యాసాగర్, ఎమ్మెల్యే అంబేద్కర్ భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని సానుకూలంగా స్పందించారని ఓ ప్రకటన ద్వారా తెలిపారు, ఈ కార్యక్రమంలో ముత్తారం గ్రామ శాఖ అధ్యక్షులు అరిగే ప్రభాకర్ పాల్గొన్నారు,

## పల్స్ పోలియోను విజయవంతం చేయండి

**సూర్య సెంటినరీ కాలనీ**

కమాన్పూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలనీ వైద్యాధికారి డా. అశోక్ తెలిపారు. ఈ నెల 03,04,05 వ తేదీలలో 0-5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు.

## ఘనంగా మల్లన్న పల్లకి సేవ

**సూర్య- కోరుట్ల**



కోరుట్ల పట్టణంలో శనివారం నుంచి మూడు రోజులపాటు సాగనున్న మల్లన్న జాతర శనివారం సాయంత్రం ప్రారంభమైంది. మొదటి రోజు మల్లన్న పల్లకి సేవ ,ఒగ్గుడోలు కళాకారుల నృత్యాలు, వాయిద్యాలతో అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని మల్లన్నకు మంగళ హారతులు పట్టారు. ఆదివారం మల్లన్న జాతర సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఉంటుందని యాదవ సంఘం నాయకులు తెలిపారు.

## ఘనంగ మాజీ స్పీకర్ దుద్దీల్ల శ్రీపాదరావు జన్మదిన వేడుకలు

**సూర్య కొడిమ్యాల**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల పరిషత్ కార్యాలయం లో శనివారం రోజు ఎంపీడీవో స్వరూప ఆధ్వర్యం లో ఉమ్మడి రాష్ట్ర శాసన సభ మాజీ స్పీకర్ దుద్దీళ్ళ శ్రీపాదరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో స్వరూప మాట్లాడుతూ శ్రీపాదరావు పేద ప్రజలకు అనేక విధాలుగా సేవ చేశారు. తను ఎమ్మెల్యే గా, ఉమ్మడి రాష్ట్ర శాసన సభ స్పీకర్ గా సేవలు అందించారు. పూర్తిగా పేదల పక్షపాతిగా పని చేశారని వారి ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని కోరారు.వారు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో ఎంపీవో ప్రవీణ్, డబ్బుతిమ్మయ్యపల్లి ఎంపిటిసి డబ్బు జగన్ మోహన్ రెడ్డి, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది,మండలం లోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల జిల్లా నేత విద్యాసాగర్ గుండెపోటు తో మృతి.

**సూర్య జగిత్యాల టౌన్**



తెలంగాణ పెన్షనర్ల,తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ,రిటర్డ్ మార్కెట్ సుప్రవైజర్ గొర్రె విద్యాసాగర్( 77)శనివారం ఉదయం గుండె పోటుతో జగిత్యాల పట్టణము లోని స్వగృహంలో మృతి చెందారు.వారి కుటుంబాన్ని పరామర్శించి,అంత్యక్రియల్లో తెలంగాణ పెన్షనర్స్,సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్స్ జిల్లా,డివిజన్,మండలాల ప్రతినిధులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.వ్యవసాయ మార్కెట్ కార్యాలయం తరపున అంత్యక్రియల ఖర్చులు రూ.30 వేలు అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ పెన్షనర్స్,సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్,మార్కెట్ కమిటీ జిల్లా అధికారి ప్రకాష్,మార్కెట్ గ్రేడ్ వన్ కార్యదర్శి రాజ శేఖర్,సీనియర్ సిటీజేన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,పెన్షనర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్,కోశాధికారి వెలుముల ప్రకాష్ రావు,మహిళా కార్యదర్శి బొబ్బాటి కరుణ,కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివనందం,జిల్లా ప్రతినిధులు నారాయణ,దేవేందర్ రావు,పి,ఆశోక్ రావు,సత్యనారాయణ,సతీష్ రాజు,గంగమ్మ,కమల,గంగారాం,యాకూబ్,మార్కెట్ కార్యాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు మరువలేనివి

**- మంథని నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత శ్రీపాదరావు - శ్రీపాదరావు 87వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు.**

**- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**సూర్య, సెంటినరీ కాలనీ**

మంథని నియోజకవర్గ ప్రజల ఆపద్బాంధవుడు... ఏనాడు మరువని నాయకుడు... అజాతశత్రువు శ్రీపాదరావు, దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు మరువలేనివి అని తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతి సందర్భంగా రామగిరి మండలంలోని రామయ్యపల్లి గ్రామంలో శ్రీపాదరావు విగ్రహానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అదే విధంగా మండలంలోని కలవచర్ల గ్రామంలో, సెంటినరీ కాలనీ లో, బేగంపేట, పన్నూరు, 8వ కాలనీ లో, కమాన్పూర్ గ్రామంలో, వివిధ గ్రామాల్లో, తహసీల్దార్ కార్యాలయంలో, ఎంపిడివో కార్యాలయంలో దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సెంటినరీ కాలనీ ఏర్పాటు చేసిన చలివేంద్రం ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. బేగంపేట గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బోర్కర్ రామచంద్ర రావు, ఎంపిడివో శైలజ, ఎంపిపి ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, నాయకులు టి.తిరుపతి యాదవ్, గంట వెంకట రమణ రెడ్డి, ముస్త్యాల శ్రీనివాస్, కాటం సత్యం, తోట చంద్రయ్య, కోట రవీందర్ రెడ్డి, తీగల సమ్మయ్య, ఎండి.మంజూరు, బండారి సదానందం, కండె పోశం, కొప్పుల గణపతి, చిందం మహేష్, దాసరి శివ, వైనాల రాజు, భాస్కరరావు, బొల్లవరం భాస్కర్ రావు, యండి మంజూరు, ముచ్చకుర్తి శ్రీనివాస్, వేము కనకయ్య, నాయకులు వీరబోయిన రాజమౌళీగౌడ్, ఆసం రాజు, రేండ్ల క్రిష్ణమూర్తి, కన్నూరి రాజేశ్వరి, దాసరి మనోజ్, మామిడి హరీష్, గుండ శంకరయ్య, వేముల శ్రీనివాస్, గంట తిరుపతి రెడ్డి, కన్నూరి సింగరేణి సంపత్, మేస్త్రి శరీఫ్, టి.కుమారస్వామి, రేండ్ల సుధాకర్, కందికట్ల శ్రీనివాస్, కన్నాల సతీష్, బూడిది రాజేందర్, కొట్టె నాగరాజు, వేము అంజి, బూస వెంకటరమణ, గడ్డి శ్రీధర్, వేముల అనీల్ నేత, పెద్ది పవన్, ఇజ్జగిరి రాజు(లడ్డు), మారేళ్ళీ రాజిరెడ్డి, శంకర్ నాయక్, చాట్ల సదానందం, తదితరులు పాల్గొన్నారు.



## పెద్దపల్లి ఎంపీ టికెట్ మాదిగలకు కేటాయించాలి




**సూర్య పెద్దపల్లి**

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ స్థానంలో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు ఎంపీ టికెట్ ఇవ్వాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపెల్లి బాపయ్య డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో అత్యధిక ఓట్లు మాదిగలవే ఉన్నాయని గుర్తు చేశారు. జాతీయ, ప్రాంతీయ పార్టీలు పెద్దపల్లి స్థానాన్ని మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న మధ్యాహ్నం 2 గంటలకు పెద్దపల్లి జెండా చౌరస్తా నుండి బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు మాదిగల డప్పుల మోతతో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని మాదిగల పెద్ద ఎత్తున డప్పులతో తరలిరావాలని, డప్పు మోతతో పార్టీల నాయకులకు కనువిప్పు కలిగిద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో కోటగిరి పాపయ్య, కాంపెల్లి ప్రభాకర్, బొంపెల్లి నారాయణ, ఆరేపల్లి రాకేష్, సంకనపల్లి లక్ష్మన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజహిత పాదయాత్రను విజయవంతం చేయండి

**- బిజెపి మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి**

**సూర్య కొడిమ్యాల**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రము లోని బిజెపి పార్టీ కార్యాలయం లో శనివారం రోజు మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశం లో మండల బిజెపి పార్టీ అద్యక్షులు రేకులపల్లి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ నిర్వహిస్తున్న ప్రజాహిత పాదయాత్ర లో భాగంగా ఈనెల మొదటి వారంలో కొడిమ్యాల మండలంలోని నల్లగొండ చెప్యాల కొడిమ్యాల అంగడి బజార్లో ప్రజాహిత పాదయాత్ర సభ కలదు కావున మండలం లోని బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు హిందూ బందువులు ప్రతి ఒక్కరు పాల్గొని ప్రజాహిత యాత్రను విజయవంతం చేయాలని మూడోసారి దేశానికి ప్రధానమంత్రి మోడీ, కరీంనగర్ కి మరోసారి ఎంపిగా బండి సంజయ్ ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చల్లా శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, రామచంద్ర రావు, శంకర్, శోభన్, మల్లేశం, శేఖర్ ,నాగరాజు, అరుణ్ కుమార్ ,శంకర్ , తిరుపతి, సుధాకర్, నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం

**- డిస్టిక్ కోఆర్డినేటర్ అశ్విని**

**సూర్య జగిత్యాల**



విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం అని జిల్లా మహిళా సాధికారత డిస్టిక్ కోఆర్డినేటర్ అశ్విని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం జగిత్యాల పట్టణంలోని విజయపురి కాలనీలో మహిళా సాధికారత కేంద్ర బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందంటే అభివృద్ధి వెనక మహిళ ఉందని సమాజ గమనానికి మహిళ ప్రధానమన్నారు. పిల్లలకి భేటీ బచావో భేటీ పడావో గురించి వివరించారు. ప్రతి బాలికను చదివించాలని ఆడపిల్లలకి ఉన్నత విద్యా చదివించడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. ఆడపిల్లల పై వివక్షత, ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి, లింగ వివక్షత గురించి లింగ సమానత్వ గురించి తెలిపారు. సఖి అందించే సేవలు గురించి, 181,1098, చైల్డ్ హెల్ప్ లైన్ తదితర హెల్ప్ లైన్స్ గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ప్రాజెక్టు, సూపర్వైజర్ కవితా రాణి, అంగన్వాడీ టీచర్లు, జిల్లా మహిళా సాధికారత కేంద్ర బృందం సభ్యులు హేమ, గౌతమి, చైల్డ్ లైన్ సిబ్బంది రజిత మహిళలు పాల్గొన్నారు.



## నకిలీ భూ పత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తుల అరెస్ట్

**- సిరిసిల్ల డిఎస్పీ భీంశర్మ**

**సూర్య తంగళ్లపల్లి**



భూమి విషయంలో చీటింగ్ చేస్తూ చంపుతానని బెదిరించిన సిరిసిల్ల కు చెందిన కల్లూరి చెందన, చౌటుపల్లి చంద్రశేకర్, రెడ్డబోయిన గోపి ల పై కేసు నమోదు చేశామని సిరిసిల్ల డిఎస్పీ భీంశర్మ తెలిపారు. వివరాల్లోకి వెళితే సిరిసిల్ల పట్టణంకు చెందినా కల్లూరి చందన, చౌటుపల్లి చంద్రశేకర్, రెడ్డబోయిన గోపి అనువారు భూమి వారిది కాకపోయినా అట్టి భూమిని అక్రమంగా ఆక్రమించాలని ఉద్దేశ్యముతో ఒక పథకం ప్రకారం తప్పుడు దస్తావేజులు సృష్టించి ఫిర్యాది అయిన గూడూరి ప్రవీణ్ కు చెందినా సర్వే నెంబరు.1562 నందు 363 గజాల భూమిని ఆక్రమించుకోవడానికి కల్లూరి చందన చౌటుపల్లి చంద్రశేకర్ కు %ఱూా% చేసిన తరువాత చౌటుపల్లి చంద్రశేకర్ అట్టి భూమిని రెడ్డబోయిన గోపి కి అమ్మినాడని తరువాత అందులో సగం భూమిని రెడ్డబోయిన గోపి కల్లూరి చందన కు రిజిస్ట్రేషన్ చేయగా వీరి ముగ్గురు ఆ భూమిని తమకు అప్పగించాలని లేకుంటే ఫిర్యాదిని చంపుతామని బెదిరించారని ఫిర్యాది చేయగా నిందితుల్లో ఒకరైన రెడ్డబోయిన గోపిని అరెస్ట్ చేసి కోర్ట్ లో హాజరుపర్చనైనదని తెలిపారు. జిల్లాలో భూ కబ్జాలు చేస్తూ, నకిలీ భూ పత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడే వారి సమాచారం వారి నేర ప్రవృత్తి ప్రజలు ధైర్యంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని డిఎస్పీ తెలిపారు.

## ఘనంగా మాజీ స్పీకర్ జయంతి వేడుకలు

**సూర్య మెట్ పల్లి టౌన్**



పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన ఫోటోకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ధర్మపురి దేవస్థానం మాజీ అధ్యక్షులు జువ్వాడి కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఆయన చేసిన సేవలను పార్టీ సభ్యులతో కొనియాడారు. యువ నాయకులంతా శ్రీపాదరావు నూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, కౌన్సిలర్లు యామ రాజయ్య, ఎర్రోల్ల హనుమాన్లు, కో ఆప్షన్ మార్గంగాధర్, పూదరి నరసగౌడ్,జక్కని కుందన్, పట్టణ యూత్ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, మైనార్టీ నాయకులు ఆఫీస్, బోడ్ల ఆనంద్, షేక్ మహమ్మద్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు పల్స్ పోలియో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం వైద్య అధికారి పరమేశ్వరి

**సూర్య కొడిమ్యాల**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రము లోని ప్రభుత్వ ఆసుపత్రి లో మండల వైద్య అధికారి పరమేశ్వరి సూర్య పత్రిక తో ప్రత్యేకంగ మాట్లాడారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం రోజు ప్రతి గ్రామం లో పల్స్ పోలియో చుక్కలు వేయడం జరుగుతుంది అని చెప్పారు. ఐదు సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలకు తప్పకుండా ప్రతి ఒక్కరికి పల్స్ పోలియో చుక్కలను వేయించాలని పిల్లల తల్లి తండ్రులకు సూచించారు. మండలం లోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద, బస్టాండ్ సెంటర్ల వద్ద మండలం లో మొత్తం ఇరవై రెండు బూతులను ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని గ్రామాలలో వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో పాల్గొంటారు అని చెప్పారు. ఎవరైన అనివార్య కారణాల వల్ల ఆదివారం రోజు అందుబాటులో లేని పిల్లలకు సోమవారం,మంగళవారం రోజులలో మా సిబ్బంది ఇంటింటికీ తిరిగి పల్స్ పోలియో చుక్కలు వేయడం జరుగుతుంది అని అన్నారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మండలం లోని అన్ని గ్రామాలలో పల్స్ పొలియో కార్యక్రమం ను విజయవంతం చేసి పోలియో రహిత సమాజం ను నిర్మిద్దామని పిలుపునిచ్చారు. దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని మండల వైద్య అధికారి పరమేశ్వరి కోరారు.

## మహిళా కాంగ్రెస్ జగిత్యాల టౌన్ అధ్యక్షురాలుగా అనిత

**సూర్య జగిత్యాల టౌన్**



మహిళా కాంగ్రెస్ జగిత్యాల పట్టణ అధ్యక్షురాలుగా మాజీ కౌన్సిలర్ పిప్పరి అనిత నియమితులయ్యారు. ఈమేరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి జగిత్యాల ఇందిరా భవన్ లో శనివారం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి సమక్షంలో అనితకు నియామక పత్రం అందజేశారు. మహిళా కాంగ్రెస్ పటిష్ఠతకు కృషి చేయాలని, పార్టీ చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నూతన అధ్యక్షురాలికి సూచించారు. అనిత నియామకం పట్ల మాజీ కౌన్సిలర్లు గాజుల రాజేందర్, దయ్యాల శంకర్,రేపల్లె హరికృష్ణ, అల్లాల సరితా రమేష్ రావు, తాడేపు రాధ రమణ, బింగి సుమ రవి,ఎడ్మల అనిత సత్తిరెడ్డి,పుప్పాల అశోక్, చిట్ల లత అంజన్న,దయ్యాల మమత తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# వరి పంట సాగు పై అవగాహన సదస్సు

:సూర్య మేడిపల్లి



మండలంలోని వల్లంపల్లి ప్రతమికవ్యవసాయ సహకార సంఘం రైతులతో శనివారం రోజు ఇఫ్కో సంస్థ ఆధ్వర్యంలో వరి పంట సాగు పై సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రసాయనిక ఎరువులు అధిక వినియోగం వలన పంటకు కలిగే నష్టాల గురించి,సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం వలన పొందే లాభాల గురించి జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి బీ. వాణి రైతులకు సందేశం ఇచ్చారు.సహకార సంఘాల వలన రైతుల ప్రయోజనాల గురించి జగిత్యాల జిల్లా సహకార అధికారి ఎం.సత్యానారాయణ తెలిపారు.రసాయనిక ఎరువులు అధికంగా వినియోగించటం వలన నేల, నీరు, వాయువు లు కలుషిత మవుతాయని,దీనివలన రసాయనిక ఎరువులు పూర్తి స్థాయిలో అందించి నప్పటికీ నేలలు సమస్యాత్మకంగా మారుతున్నాయని, దీనికి ప్రత్నామ్నయంగా ఇఫ్కొ సంస్థ ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా నానో టెక్నాజీ ద్వారా నానో యూరియా,నానో డీ ఏ పి ఎరువులను తయారు చేశారని ఇఫ్కొ సంస్థ సీనియర్ మేనేజర్ బాలాజీ అన్నారు.పిచికారి సులభతరం చేసేందుకు సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఇఫ్కో కిషాన్ డ్రోన్ లను దేశ వ్యాప్తంగా2400లను పంపిణీ చేసినట్లు తెలిపారు. జగిత్యాల జిల్లాకు 8డ్రోన్ లను కేటాయించారని, అందులో భాగంగా వల్లంపల్లి సహకార సంఘంలో డ్రోన్ సౌకర్యాన్ని ప్రారంభించామని జగిత్యాల జిల్లా ఇఫ్కో మేనేజర్ శ్రీధర్ తెలిపారు. పొలాస వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు పి.రవికుమార్,ఎస్.శ్రీనివాస్ నాయక్ లు మాట్లాడుతూ వరి పంటలో ఎరువుల యాజమాన్యం, సస్య రక్షణ గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో వల్లంపల్లి ప్రాథమిక వ్యవసాయ సంఘం ఛైర్మెన్ మేన్నెని రవీందర్ రావు,సీ ఈ ఓ గోపి,మేడిపల్లి ఛైర్మెన్ రమేష్ రెడ్డి,మండల వ్యవసాయాధికారి త్రివేదిత, ఏ ఈ ఓ లు వివిధ గ్రామాల 300మంది రైతులు పాల్గొన్నారు.

## పోలీసుల కస్టడీలో అక్షర చిట్ ఫండ్స్ చైర్మన్, డైరెక్టర్లు

సూర్య కరీంనగర్ ప్రతినిధి

ఖాతాదారులకు సకాలంలో డబ్బు చెల్లించకుండా, మోసగించి, చిట్ ఫండ్ కంపెనీ నందు వారు జమ చేసుకున్న డబ్బుతో సొంత ఆస్తులు కూడబెట్టిన కేసులో అక్షర చిట్ఫండ్ చైర్మన్ పేరాల శ్రీనివాసరావు, ఇద్దరు డైరెక్టర్లు అయిన సూర్యని కొండలరావు ఉప్పల రాజేందర్ లను కరీంనగర్ సీతారాంపూర్ కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి శ్రీరామ్ వెంకట్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత నెల 21వ తేదీన అరెస్టు కాబడి రిమాండ్ కు తరలించిన విషయం విధితమే. కేసుకు సంబంధించిన మరిన్ని కీలక ఆధారాలు సేకరించేందుకు నిందితుల ముగ్గురిని కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు కోర్టు ద్వారా శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుండి ఈ నెల ఆరవ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు ఐదు రోజులు పోలీస్ కస్టడీలోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా కరీంనగర్ రాజీవ్ చౌక్, కోతిరాంపూర్, జ్యోతి నగర్ లో గల అక్షర చిట్ ఫండ్ బ్రాంచీలలో తనిఖీలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను. కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు స్వాధీనపరచుకున్నారు.

## గురుకుల ఉద్యోగ పరీక్షల లో విజయం సాధించిన దివ్య

సూర్య- కోరుట్ల



కోరుట్ల పట్టణానికి చెందిన తుమ్మనపెల్లి దివ్య తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన టి జి టి బయాలజికల్ సైన్స్ నందు 2023 సంవత్సరంలో జరిగిన గురుకుల ఉద్యోగ పరీక్షలలో విజయం సాధించి ఉపాధ్యాయురాలుగా ఉద్యోగం సాధించింది. ప్రాథమిక విద్యాభ్యాసం జగిత్యాల జిల్లా పెంబట్ల గ్రామం నందు, ఉన్నత విద్య జగిత్యాల , హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ల లో విద్యాభ్యాసం చేసి తన తల్లిదండ్రులకు ఇచ్చిన మాట కొరకు 8 సంవత్సరాల నుండి నిరీక్షిస్తూ, వివాహం జరిగిన తర్వాత కూడా తన లక్ష్యసాధన వదలకుండా తన ఇద్దరు పిల్లలను ,తన కుటుంబాన్ని చూస్తూ ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని ఎదుర్కొంటూ పట్టువదలని విక్రమార్కుడిలా తన లక్ష్య సాధన గురించి ప్రయత్నం చేస్తూ, ఇప్పుడు జరిగిన పరీక్షలో ఉపాధ్యాయ ఉద్యోగం లో విజయం సాధించారు. లక్ష్యసాధన గమ్యం నిర్దేశించుకొని విజయం సాధించే వరకు ప్రయత్నం ఆపకూడదని భావితరాల వారికి మార్గ నిర్దేశికత చేశారు. స్త్రీ విజయం సాధించడం వల్ల తన పుట్టిన ఊరుకు, మెట్టిన ఊరుకు మంచి గుర్తింపు వస్తుందని చెప్పారు. తన బాల్యమలో నిర్దేశించుకున్న ఉపాధ్యాయ వృత్తి జీవిత ఆశయాన్ని తను సాధించినందుకు, దేశ భవిష్యత్తును నిర్దేశించే గురువు అవకాశం లభించినందుకు గర్వంగా ఉందని,ఈ ఉపాధ్యాయ ఉద్యోగం చే విద్యార్థులను భారతదేశ ఉన్నత పౌరులుగా, విజయసాధకులుగా తీర్చి దిద్దుతానని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో తాగు నీటి కరువు..

- అవస్థలు పడుతున్న విద్యార్థులు

సూర్య జగిత్యాల అర్బన్



స్థానిక జగిత్యాల పట్టణ పాత బస్టాండ్ పరిధిలోగల ఓల్డ్ హైస్కూల్ పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు అస్తవ్యస్తంగా మారింది. వివరాల్లోకెళ్తే ఓల్డ్ హై స్కూల్లో గల విద్యార్థులు తాగు నీటి వసతి లేక మధ్యాహ్న భోజన సమయంలో పాత బస్టాండ్ ఏరియాలో గల ఆసుపత్రులలో, హోటల్స్ లో వాటర్ బాటిల్స్ లో నీరు పట్టుకొని తాగడం గమనించిన ప్రజల మనసును కలచి వేసింది. పరిస్థితి గమనించి ఇదేమిటని సంబంధిత పాఠశాలకు వెళ్లగా భోజన విరామం తర్వాత ఉపాధ్యాయులు ఒక్కొక్కరిగా ఆలస్యంగా స్కూలుకు రావడం వారికి విధులపై ఉన్న శ్రద్ధకు నిదర్శనం. అక్కడే ఉన్న ఉపాధ్యాయుడిని నీటి కొరత గురించి విచారించగా ప్రొద్దున ఓ 20 లీటర్ల డబ్బాలో బోర్ వాటర్ నింపి తాగునీటిగా అందుబాటులో పెట్టడం , మధ్యాహ్నం 2 తర్వాత మునిసిపల్ నల్లా నీరు అందుబాటులో పెట్టడం జరుగుతుందన్నారు. పెట్టిన ఉప్పునీటిని విద్యార్థులు ఇష్టపడక బయటకు వెళ్లి తాగడం ఓ దినచర్యగా మారింది. వాస్తవానికి ఉప్పు నీటిలో టిడిఎస్ శాతం 400 మించి ఉంటుంది. పిల్లల ఆరోగ్య దృష్ట్యా టిడిఎస్ 150 నుండి 250 మధ్యలో ఉండటం శ్రేయస్కరం. కానీ బోర్ వాటర్ లో టీడీఎస్ లెవెల్స్ ఎక్కువగా ఉన్న నీటిని తాగడం వల్ల కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండడం గమనార్హం. ఇకనైనా ఇట్టి విషయాన్ని సంబంధిత క్షేత్రస్థాయి విద్యాధికారులు , జిల్లా స్థాయి అధికారులు పిల్లలకు కనీసం మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని విషయం తెలిసిన పురప్రజలు విద్యావంతులు కోరుతున్నారు.

## స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు సేవలు మరువలేనివి

-ఆర్జీ-3 జిఎం నరేంద్ర సుధాకరరావు

సూర్య, సెంటినరీ కాలనీ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు సేవలు మరువలేనివని ఆర్జీ-3 జీ.ఎం నరేంద్ర సుధాకరరావు అన్నారు. శనివారం జిఎం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు 87వ జయంతి వేడుకలలో భాగంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు మంథని నియోజవర్గ శాసనసభ్యులు గా ఆ ప్రాంత అభివృద్ధి తో పాటు, అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేశారని అన్నారు. అంతే కాకుండా వారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గా పని చేసినప్పుడు స్వపక్షం, విపక్షం అనే తేడా లేకుండా అన్ని పార్టీలకు అవకాశం కల్పించి అందరి మన్ననలు పొందారని అన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం వారు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని మంచి బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ పాలపర్తి ఎలీషా, ఎస్వోటు జీఎం గుంజపడుగు రఘుపతి, అధికారుల సంఘం అధ్యక్షుడు సి.హెచ్.వెంకట రమణ, అధికారులు కే.చంద్రశేఖర్, పి. రాజారెడ్డి, కాశీ విశ్వేశ్వర రావు, ఈ.నాగేశ్వర రావు,పి.డి.సుధాకర్,ఆర్. శ్రీనివాస్ , ఎం.నాగరాజు,గుర్రం శ్రీహరి, ఆర్.రాజేశ్వరి,ఎస్. శ్యామలా, ఐ.ఎన్.టి.యు.సి ప్రతినిధి రవీందర్ లతో పాటు వివిధ విభాగాల అధిపతులు, అధికారులు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రూప్1 ప్రిలిమ్స్ కు ఉచిత శిక్షణ

- బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్

సూర్య జగిత్యాల ప్రతినిధి:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్1 ప్రిలిమ్స్ కు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా లోని గ్రూప్ -1 నిరుద్యోగ అభ్యర్థులందరూ ఉచిత శిక్షణ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, నేరుగా వచ్చి 7వ తేది లోపు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా డిగ్రీ(50%) మార్కులతో ఉత్తీర్ణులై, .కులం , ఆదాయం, ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 5.00 లక్షలకు మించకూడదనీ, గ్రూప్-1 అక్నాలెడ్జ్మెంట్ ఫాం తప్పనిసరి ఉండాలని, ROR ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.మరింత సమాచారం కోసం నేరుగా ఆఫీస్ వేళల్లో లేదా ఫోన్ నెంబర్స్ 0878-2268686 ను సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా కీ.శే. దుద్దిల్ల శ్రీపాదరావు జన్మదిన వేడుకలు

సూర్య ధర్మపురి:



ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ కీ.శే. దుద్దిల్ల శ్రీపాదరావు 87 వ జన్మదిన వేడుకలు ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ కూడలిలో కీ.శే. శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంగనబట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేముల రాజేష్, చిలుముల లక్ష్మణ్, సీపతి సత్యనారాయణ, జక్కు పద్మ రవిందర్, వొజ్జల లక్ష్మణ్, అప్పం తిరుపతి, రఫీయొద్దిన్, గరిగే రమేష్, గాజు సాగర్, ఎండీ షబ్బీర్, స్తంభంకాడి గణేష్, నరేందర్, బొల్లారపు పోషన్న, గుడ్ల రవీందర్, రమణ, సత్తన్న, శరత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్యాలయంలో

మాజీ స్పీకర్ కీ.శే. దుద్దిల్ల శ్రీపాదరావు 87వ జన్మదినాన్ని పురస్కరించుకొని ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తమ్మ, కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మెన్ ఇందారపు రామన్న, కౌన్సిల్ సభ్యులు వేముల నాగలక్ష్మి, అయ్యోరి వేణుగోపాల్, సంగనబట్ల సంతోషి, గుర్రాల సుధాకర్, జక్కు పద్మ, బండారి అశోక్, కో ఆప్షన్ సభ్యులు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు

## మొగి పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

సూర్య, హుజురాబాద్ రూరల్



వరి మొక్కజొన్న పంటలకు సోకుతున్న మొగి పురుగు నివారణకు రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జగిత్యాల శాస్త్రవేత్తలు డా. డి. శ్రీలత, డా. బి. శ్రీనివాస్, డా. బలరాం, డా. సాయినాథ్ లు అన్నారు. శనివారం హుజురాబాద్ మండలం రాంపూర్, సిర్సపల్లి, ధర్మరాజు పల్లి గ్రామాలలో రైతులు సాగు చేసిన వరి, మొక్కజోన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పంటను ప్రధానంగా మొగి పురుగు ఆశించి నష్ట పరుస్తోందనీ అన్నారు. మొగి పురుగు నివారణకు నారు మడిలో, పిలక దశలో మొగి పురుగు ఆశిస్తే పిలకలు ఎండి చనిపోతాయని అన్నారు. వరి పిలక దశలో కార్టప్ హైడ్రో క్లోరైడ్ ఎకరానికి 400 గ్రాములు 160 - 200 లీటర్ల నీటిలో కలుపుకుని పిచికారి చేయాలని, వరి పంటకు అక్కడక్కడ అగ్గి తెగులు ఆశిస్తుందని, అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ ఎకరానికి 120 గ్రాములు పిచికారి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు గూండా సునీత, హుజురాబాద్ వ్యవసాయ అధికారి సిహెచ్. సునీల్ కుమార్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, అచ్యుత్, రైతులు పాల్గొన్నారు.

### భారీ జలాశయాలపై మరో 800 మె.వా

# సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సింగరేణి సన్నాహం

- రాజస్థాన్ లో 500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ కు ప్రాజెక్ట్ రిపోర్ట్‌కు ఆదేశం
- మరింత తక్కువ ధరలో విద్యుత్ ఉత్పత్తికి కృషి చేయాలి
- రాష్ట్రంలో పవన విద్యుత్ ప్లాంట్ ల ఏర్పాటుకు పరిశీలన
- సింగరేణి సంస్థ చైర్మన్ మరియు ఎండి ఎన్.బలరాం

**సూర్య, సెంటినరీ కాలనీ**

ఇప్పటికే కంపెనీ వ్యాప్తంగా 234 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన సింగరేణి సంస్థ త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తో భారీ జలాశయాలపై సుమారు 800 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి సంసిద్ధంగా ఉందని సింగరేణి చైర్మన్ మరియు ఎండి నేనావత్ బలరాం నాయక్ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో ఆయన సింగరేణి విద్యుత్ విభాగం పై డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావుతో పాటు ఇతర ఉన్నతాధికారులతో శనివారం నాడు ప్రత్యేక సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కంపెనీ వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా కొత్తగా సింగరేణి సంస్థ చేపట్టనున్న సోలార్ విద్యుత్ ప్రాజెక్టులపై చర్చించారు. సోలార్ విద్యుత్ పెంపుదలకు కృషి చేయాలని ఇటీవల రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చిన నేపథ్యంలో భారీ జలాశయాలైన లోయర్ మానేరు డ్యాం పైన 300 మెగావాట్ల నీటిపై తేలియాడే సోలార్ ప్లాంట్, మల్లన్న సాగర్ జలాశయం పైన 500 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటుకు తగు సన్నాహ చర్యలు తీసుకోవాలని సంస్థ చైర్మన్ మరియు ఎండి ఎన్.బలరాం సంబంధిత అధికారులను ఆదేశించారు. లోయర్ మానేర్ డ్యాం పై 300 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన డిపిఆర్ సిద్ధంగా ఉంది కనుక దీనిపై రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో నిర్మాణం చేపట్టడానికి కంపెనీ సిద్ధంగా ఉందన్నారు. కాగా మల్లన్న సాగర్ జలాశయం పై ఏర్పాటు చేయ తలపెట్టిన రెండు 250 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి



డిపిఆర్ ను వెంటనే రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాజస్థాన్ రాష్ట్రంలో సింగరేణి ఏర్పాటు చేయతలపెట్టిన 500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ కు సంబంధించిన కార్యాచరణ పై కూడా ఆయన సమీక్షించారు. దీనిపై రూపొందించిన డీపీఆర్ పై మరింత లోతుగా అధ్యయనం జరపాలని, తక్కువ ధరకే విద్యుత్ ఉత్పత్తి జరిగే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, తద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలు సింగరేణి సోలార్ విద్యుత్తును ఎక్కువగా కొనే అవకాశం ఉంటుందన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద గల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర పనితీరుపై కూడా ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. ప్రస్తుత 1200 మెగావాట్ల ప్లాంటుకు అదనంగా అదే ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి నిర్మాణం ప్రారంభించాలని అధికారులను కోరారు. ఇటీవల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమృత లాల్ మీనా ఇదే ప్రాంగణంలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ ప్లాంట్ తో పాటు మరో ఎనిమిది వందల ప్లాంట్ ను కూడా నిర్మించే అవకాశాలను పరిశీలించాలని సూచించారని .కనుక దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై వెంటనే ఒక నివేదిక సమర్పించాలని చైర్మన్ ఆదేశించారు. వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలో పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటు చేయడానికి అవకాశం గల ప్రాంతాలను సందర్శించాలని, దీనికి సంబంధించి ఒక నివేదికను కూడా రూపొందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బసివి రెడ్డి, సివిల్ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ, సోలార్ మేనేజర్ జానకిరామ్, చీఫ్ ఆఫ్ పవర్ ఎన్ వి కే వి రాజు, చీఫ్ ఓ అండ్ ఎం జె ఎన్ సింగ్. డీజీఎం లు వేణుగోపాల్, సిహెచ్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 10న మంత్రి పొన్నం ప్రభాకర్ కు సన్మానం

**సూర్య, జమ్మికుంట**

రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ గౌడ్ కి ఈనెల 10 న కరీంనగర్ లో సన్మానం చేయడానికి గౌడ సంఘం నాయకులు నిర్ణయించారు ఈ మేరకు జమ్మికుంటలో గోడ సంక్షేమ సంఘం నాయకులు కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న జగన్ గౌడ్ పంజాల రాజన్న గౌడ్ తాళ్ల పెల్లి సంపత్ గౌడ్ వైస్ ఛైర్మన్ దేశిని స్వప్న కోటి మాట్లాడుతూ ఈ ప్రాంత గౌడ సోదరులందరూ పార్టీలకు అతీతంగా స్వచ్ఛందంగా ఐక్యతగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు ఇందులో కౌన్సిలర్లు బొంగుని వీరన్న, శ్రీపతి నరేష్ , దేశిని రాధా సదానందం, గౌడ సంఘ రాష్ట్ర నాయకులు బుచ్చన్న గౌడ్ , పంజాల వెంకన్నగౌడ్ , నరసయ్య గౌడ్, దాసరి రామ్మూర్తి గౌడ్ , సుదర్శన్ గౌడ్, పూదరి విజయ్ , గట్టు శ్రీనివాస్, పూదరి శ్రీనివాస్ , అనిల్ గౌడ్ , బొంగుని సదానందం , బుర్ర సంపత్ గౌడ్, మోటబోతుల దేవేందర్, దోమ్మటి రాజమల్లు, కొమురయ్య, గట్టు వీరన్న , గౌడ సోదరులు పాల్గొన్నారు

## శివగాన స్వరాభిషేకం వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**సూర్య, జగిత్యాల**



ఈనెల 8 మహాశివరాత్రి నాడు నక్కరాజు నిర్వహించే 24 గంటల నిర్విరామ మహద్రుఢ సంకల్ప శివ గాన స్వరాభిషేకం వాల్ పోస్టర్ ను శనివారం జగిత్యాల పట్టణంలోని థరూర్ క్యాంపు శ్రీ కోదండ రామలయంలో ఆవిష్కరించారు. మొదట ఆలయంలో నాయకుల గోత్రణామాధులతో ఆలయ పూజారి అర్చనలు చేయగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గాయకుడు నక్క రాజుతో పాటు ట్రస్మా జిల్లా అధ్యక్షులు బోయిన్ పెల్లి శ్రీధర్ రావు, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, జగిత్యాల వర్థక సంఘం సహాయ కార్యదర్శి బోయిన్ పెల్లి ప్రశాంత్ రావుల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. జగిత్యాల పట్టణం బైపాస్ రోడ్డు లోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో మాహా శివరాత్రి సందర్భంగా ప్రముఖ గాయకులు,బుగ్గారం వాస్తవ్యులు నక్క రాజు ఈనెల 8న ఉదయం 8 గంటల నుండి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు ద్వాదశ వసంతాలలో భాగంగా 6వ సారి మాహాద్రుడ సంకల్ప శివ గాన స్వరాభిషేకం కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంచర్ల సింగిల్ విండో చైర్మన్ మంత్రి వేణుగోపాల్, శరత్ రావు, సీనియర్ పాత్రికేయులు సత్యనారాయణ గౌడ్, బొడ్డుపెల్లి అంజయ్య, ఉపాది హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డం రమేష్, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీల సంబరాలు

**సూర్య, మెట్ పల్లి టౌన్**



కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలనూ అమలు చేస్తున్నందుకు శనివారం పట్టణంలోని పదకొండవ మరియు పన్నెండు, సంగం హాస్పిటల్ వార్డుల ప్రజలు జాతీయ రహదారిపై టపాసులు పేల్చి, పక్కనే ఉన్న అయ్యప్ప గుడి వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే మొదటి గా మహిళలకు ఉచిత బస్సు మరియు ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత కరెంటును అమలు చేసిన ఏఐసీసీ మాజి అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్యులు దుద్దుల శ్రీధర్ బాబు మరియు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పట్టబద్రులు ఎమ్మెల్సీ టీ.జీవన్ రెడ్డి, ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, కొమిరెడ్డి కరంచంద్ లకు వార్డు ప్రజలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు షాకీర్ సిద్ధి, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు స్వప్న, లక్ష్మి ,పూజ, రాణి, ఉష, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా బండి సంజయ్‌ను ప్రకటించడంపై బిజెపి శ్రేణులసంబరాలు

**సూర్య, కరీంనగర్ ప్రతినిధి**

భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం పోటీ చేసే అభ్యర్థుల మొదటి జాబితాలో బండి సంజయ్ కుమార్ పేరు ప్రకటించడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బిజెపి శ్రేణులు సంబరాలు నిర్వహించారు. హుజురాబాద్ మండలంలోని చెల్పూర్ లో జరుగుతున్న ప్రజాహిత యాత్ర లో ఉన్న బండి సంజయ్ కుమార్ ను బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కరీంనగర్ బీజేపీ అసెంబ్లీ శ్రేణులు తెలంగాణ చౌక్ లో టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రజాహిత యాత్రలో ఉన్న బిజెపి నాయకులు, కార్యకర్తలు జమ్మికుంట లోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులందరూ వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరు బండి సంజయ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి బోయిన్పల్లి ప్రవీణ్ రావు, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి, సంపత్ రావు,కటకం లోకేష్, దుర్శెట్టి సంపత్, దూల శ్రీనివాస్, ఎండి ముజీబ్, ఉప్పరపల్లి శ్రీనివాస్, బొంతల కళ్యాణ్ చంద్ర, యువ క్రాంతి, ఈసంపల్లి మహేష్ , సంతోష్, కుమార్, శ్రీకాంత్, తోట అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## అవార్డుతో పెరిగిన మరింత బాధ్యత

**- ప్రభాకర్ రావు**

**సూర్య, హుజురాబాద్ రూరల్**

ఉత్తమ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు పొందడంతో మరింత బాధ్యత పెరిగిందని నాగార్జున డైరీ ఎండి పుల్లూరు ప్రభాకర్ రావు అన్నారు. శనివారం హుజురాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్ద గల నాగార్జున డైరీలో ఉత్తమ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు పొందిన మిత్రులు, ఉద్యోగులు ఎండి ప్రభాకర్ రావుకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరీ ని స్థాపించిన నాటి నుండి పట్టుదలతో మంచి ఫలితాలు సాధించడానికి నాణ్యత పరమైన లోపాలు లేకుండా ప్రయత్నిస్తూ నడిపిస్తున్నానని అన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ ప్రజలకు అందుబాటులో డైరీ ఉత్పత్తులను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ కు చెందిన షిఫ్ట్ అండ్ లిఫ్ట్ మీడియా సంస్థ అవార్డు ప్రకటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఉద్యోగుల యాజమాన్య సమిష్టి కృషితో 18 సంవత్సరాలుగా డైరీ ప్రజల మన్ననలను పొందుతుందని, రాబోయే కాలంలో మరింత ఉన్నతంగా నడిపిస్తామని ఆయన అన్నారు. పాల పదార్థాలు ఉత్పత్తి చేయడమే కాకుండా వాటిలో నాణ్యత పాటిస్తూ ప్రజా మద్దతు పొందుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరీ డైరెక్టర్ పుల్లూరి గణేష్ రావు, శృతి, ఎస్సారెస్పీ నీటి సంఘ మాజీ అధ్యక్షులు చొల్లేటి కిషన్ రెడ్డి, ప్రభుత్వ సహాయ న్యాయవాది కేతిరి శ్రీనివాస్ రెడ్డి, సీఈఓ ప్రసాద్, ఏజీఎం సుధాకర్, రజినీకాంత్ రెడ్డి, కోటేశ్వరరావు, ధర్మారెడ్డి, సృజన్, రాజన్న, కుటుంబ సభ్యులు, ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.